
ఆ డొమైన్ పేరుకు రూ. 634 కోట్లు




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 14 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 42 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


అందుకే.. పంచశీల ఒప్పందం



2



## గిరి ప్రదక్షిణ మార్గం శంకుస్థాపన

### వర్చువల్గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 మనం న్యూస్: దేవాలయాలే మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని, గిరి ప్రదక్షణ చేసిన ప్రతి భక్తునికి కైలాసగిరి పుణ్యఫలం దక్కాలని గౌ.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.

శుక్రవారం శ్రీకాళహస్తి స్వామి దేవస్థానంలో ఆలయ ఆవరణలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జవహర్లాల్, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరని శ్రీనివాసులు, గిరి ప్రదక్షణ మార్గం శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమం వర్చువల్ గా ప్రారంభించగా.. తిరుపతి జిల్లా నుంచి శ్రీకాళహస్తి ఆలయం ప్రాంగణం నుంచి ఆలయం ఈ వో బాపిరెడ్డి, ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్,

...మిగతా 2లో


## గుంటూరు నుంచి విజయవాడకు 6 గంటలా..

# ప్రజలు నరకం అనుభవించాలా?

అమరావతి: రాజకీయాల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్, వైకాపా నేతలను ఉద్దేశించి అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నేత రోడ్డుపైకి వస్తున్నాడంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకుంటోందన్నారు. "ఎక్కడికి వెళ్లినా దౌర్జన్యం, రోడ్డంతా బ్లాక్ చేయడం వంటివి చేస్తున్నారు. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లాలంటే ఆరు గంటలా?ఆ సమయంలో ప్రజలు నరకం అనుభవించాలా?జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం సున్నితమైన సమస్య. దీనిపై ఎక్కువ మాట్లాడకూడదనుకున్నా. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. వేంకటేశ్వరస్వామి విషయంలో తెలిసి కానీ.. తెలియక కానీ తప్పు చేయను. నిద్ర రానప్పుడు ఆయన్ను తలచుకుంటే వచ్చేస్తుంది. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను ప్రక్షాళన చేశాం.

### హెరిటేజ్‌కు ఏం సంబంధం?

తిరుమల లడ్డూ కల్తీకి.. హెరిటేజ్‌కు ఏం సంబంధం?ప్రభుత్వం నుంచి ఆ సంస్థ ఒక్క పైసా కూడా అడగలేదు. పత్రిక ఉంది కదా అని పెద్ద హెడ్‌లైన్లు పెడుతున్నారు. వాళ్ల ఉద్దేశం బ్రాండ్ దెబ్బతీయడమే. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందనేది వాళ్ల భావన" అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.





3

వ్యాఘ్ర వాహనంపై సోమస్కందమూర్తి

# ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం పరుగులు

### పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి: నేషనల్ ట్రావెల్ మార్ట్' కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు మరియు ఎకో-అడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్ లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను

...మిగతా 2లో





3

స్వర్ణరథంపై శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి కటాక్షం

పెద్ద సంఖ్యలో రథాన్ని లాగిన మహిళలు



# రాష్ట్ర ప్రయోజనాలే బిజెపి లక్ష్యం

### అతి పెద్ద రాజకీయ ప్రశిక్షణ

ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశిక్షణ

అమరావతి..పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ ప్రారంభం

రాష్ట్ర ప్రశిక్షణ లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు

విజయవాడ,మనం న్యూస్: దేశ,రాష్ట్ర ప్రయెజనాలే బిజెపి ముందున్న లక్ష్యాలని,ప్రతి నాయకుడు,కార్యకర్త రాష్ట్రంలో బిజెపి పటిష్టతకు నడుంబిగ్గించాలని బిజెపి రాష్ట్ర అద్యక్షులు పివియస్ మాధవ్ పిలుపునిచ్చారు. భవానీపురంలోని ఎస్ కన్వెన్షన్లో 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్' రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు హాజరయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రారంభ సమావేశంలో కీలక దిశానిర్దేశం చేశారు. ప్రశిక్షణ ద్వారా సంస్థాగత బలోపేతం అవుతుంది పార్టీ సిద్ధాంతాలను, ప్రశిక్షణ ద్వారా కార్యకర్తలను క్షేత్రస్థాయిలో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే

...మిగతా 2లో

### ఆప్కాస్ట్‌తో కలిసి వేస్ట్‌మేనేజ్‌మెంట్

రీసైక్లింగ్ స్టార్టప్ ఇంక్యుబేషన్

# సెంటర్ల ఏర్పాటు

స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ వెల్లడి



విజయవాడ/తిరుపతి,ఫిబ్రవరి 13మనం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి(ఆప్కాస్ట్)తో కలిసి రాష్ట్రంలో వేస్ట్మేనేజ్మెంట్, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. విజయవాడ భవానీపురంలోని వీడీ పురంలో ఉన్న అప్కాస్ట్ ప్రాంతీయ విజ్ఞాన పట్టాభిరామ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ, నూతన ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు ఉపయోగపడే విధంగా,

...మిగతా 2లో




## పేర్ని నానికి నోటీసులు ఇవ్వండి

ఏపీ హైకోర్టు

చంద్రబాబు, పవన్‌లను దూషించిన కేసు

పేర్ని నాని క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

నోటీసులు ఇచ్చి విచారించాలని అదేశం

అమరావతి, మనం న్యూస్: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లను దూషించిన అంశానికి సంబంధించి మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఏపీ హైకోర్టులో పేర్ని నాని క్వాష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను నిన్న విచారించిన హైకోర్టు పేర్ని నానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. పేర్ని నానిపై నమోదైన కేసులు ఏడేళ్లలోపు శిక్షకు సంబంధించినవేనని... క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 35(3) ప్రకారం ఆయనకు నోటీసులు ఇచ్చి, విచారణ కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. పేర్ని నాని క్వాష్ పిటిషన్ ను కొట్టివేసింది. తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది.

## తిరుపతి అభివృద్ధికి సహకరించండి



3

# 20 నిమిషాల్లో మల్లన్న దర్శనం పూర్తి



సాధారణ భక్తులకు ప్రాధాన్యత • ఉచిత క్యూలైన్ ద్వారా భ్రమరాంబసమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్న కలెక్టర్

శ్రీశైలం/నంద్యాల, ఫిబ్రవరి 13మనం న్యూస్: ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీశైలం దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉచిత క్యూలైన్ ద్వారా సాధారణ భక్తులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న

...మిగతా 2లో

# పీఎంఓ కొత్త భవనం 'సేవా తీర్థ్' ప్రారంభం

### పలు కొత్త పథకాలకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ


రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సాయమందించే 'పీఎం-రాహత్' పథకం ఆరంభం


వ్యవసాయ మౌలిక సదుపాయ నిధులు రూ. 2 లక్షల కోట్లకు పెంపు

స్టార్టప్ వ్యవస్థ వేగవంతానికి రూ.10 వేల కోట్ల నిధులు

ఢిల్లీ, ఫిబ్రవరి 13: ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం 'సేవా తీర్థ్'ను ప్రధాని మోడీ ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా పీఎంఓ కార్యాలయం కొత్త భవనంలోకి మారడం ఈ సందర్భంగా గమనార్హం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రూ.100 ప్రత్యేక నాణేన్ని కూడా విడుదల చేశారు. ఇకనుంచి అత్యాధునిక వసతులున్న ఈ భవనం నుంచే ప్రధాని తన అధికారిక కార్యకలాపాలు కొనసాగిస్తారు.

'సేవా తీర్థ్'తోపాటు పలు కీలక మంత్రిత్వ శాఖలున్న కర్తవ్య భవన్ 1, 2 లను ప్రధాని ప్రారంభించారు. ప్రస్తుతమున్న పలు మంత్రిత్వ శాఖల భవనాలు, కార్యాలయాలు పాతవి కావడంతో రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక వసతులతో కొత్త భవనాల నిర్మాణం జరిగింది. ఇప్పటివరకు వేర్వేరు చోట్ల ఉన్న పీఎంఓ, జాతీయ భద్రతా మండలి కార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్లను ఇప్పుడు ఒకే ప్రాంగణం లోకి మార్చనున్నారు. కర్తవ్యభవన్ 1, 2లోకి న్యాయ, రక్షణ, ఆర్థిక, వైద్య ఆరోగ్య, వ్యవసాయం వంటి కీలక మంత్రిత్వ శాఖలను తరలించనున్నట్లు సమాచారం.






### 'పీఎం-రాహత్' పథక ఫైలుపై తొలి సంతకం

'సేవాతీర్థ్' ప్రారంభం సందర్భంగా ప్రధాని పలు పథకాలకు ఆమోదం తెలిపారు. అందులో 'పీఎం-రాహత్' ఒకటి. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం కింద రూ.1.5 లక్షల మేర నగదు రహిత చికిత్స అందనుంది. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్

...మిగతా 2లో

# ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగలి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సంస్కృతిని, రామాయణ కాలం నాటి దండకారణ్య విశేషాలను ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయానికి ప్రాధాన్యతనిచ్చారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024-29,పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా, సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులతో ఇన్వెస్టర్లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేవలం 18 నెలల్లో రూ.20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా 1,22,637 ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమమైందని వెల్లడించారు. తద్వారా హోటల్స్, రిసార్ట్స్, థీమాటిక్ పార్క్ లు తదితరాలు పెద్దఎత్తున ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. కేవలం 'ఈజ్ ఆఫ్ డూయింగ్' మాత్రమే కాకుండా, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. సరళీకత విధానాలు, సింగిల్ విండో క్లియరెన్స్, ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్స్, రియల్-టైమ్ ట్రాకింగ్, పారదర్శకమైన భూ కేటాయింపులు నిర్ణీత కాలపరిమితిలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు.

**టూర్ ఆపరేటర్లు – మా స్టోరీ టెల్లర్స్**

ఆంధ్రప్రదేశ్ అందాలను దేశ విదేశాల పర్యాటకులకు పరిచయం చేసే కథకులు, ప్రచారకర్తలు, నిర్వాహకులు టూర్ ఆపరేటర్లు అని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. ''ప్రభుత్వం పునాది వేస్తే, టూర్ ఆపరేటర్లు దానికి ప్రాణం పోస్తారు. మీరు కేవలం వ్యాపారవేత్తలు కాదు, మా రాష్ట్ర అందాలను ప్రపంచానికి వినిపించే స్టోరీ టెల్లర్స్'' అని మంత్రి దుర్గేష్ కొనియాడారు. టూర్ ఆపరేటర్లే ప్రభుత్వానికి, మార్కెట్ డిమాండ్‌కు మధ్య వారధి అని, వారే మా అసలైన రాయబారులని పేర్కొన్నారు.ప్రభుత్వం కొత్త సర్క్యూట్‌లను, క్రూయిజ్‌లను లేదా హోమ్‌స్టే నమూనాలను ప్రవేశపెట్టినప్పుడు వాటిని మెరుగుపరిచి, ప్రమోట్ చేసినప్పుడే అవి విజయవంతమవుతాయన్నారు. ప్రభుత్వ విజన్‌ను పర్యాటక ప్యాకేజీలుగా, మధుర జ్ఞాపకాలుగా మార్చే శక్తి టూర్ ఆపరేట్లకు ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు టూర్ ఆపరేటర్లు చేతులు కలిపినప్పుడే పర్యాటకం వర్ధిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని కోరారు.తద్వారా ఇన్ బౌండ్ టూరిజంను పెంచాలని సూచించారు. సజనాత్మకత, సంస్కృతి, సామాజిక ప్రభావాల అద్భుత కలయికతో టూర్ ఆపరేటర్లు, ఇన్వెస్టర్లు మరియు భాగస్వాములు అందరం కలిసి ఆంధ్రప్రదేశ్‌ను భారత్‌లోనే అత్యంత శక్తివంతమైన పర్యాటక కేంద్రంగా (భారతదేశపు ఎక్స్‌పీరియన్స్ క్యాపిటల్) తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

**భవిష్యత్తు ప్రణాళికలు:**

విశాఖ నుండి అరకు వరకు త్వరలో కారవాన్ టూరిజం ప్రారంభిస్తామని, గ్రామీణ సంస్కృతిని పరిచయం చేసేలా హోమ్‌స్టేలు, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ పాలసీ, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాబోయే మైస్, ఫిల్మ్ టూరిజం పాలసీలు అసెట్-లైట్ మోడల్ పెట్టుబడులకు ఊతమిస్తాయని భావిస్తున్నామన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రం కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, క్రూయిజ్, రివర్, అగ్రి, హెరిటేజ్, మెడికల్ వెల్ నెస్ టూరిజంకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మన రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక 'స్టార్టప్' లాంటిది. ఇక్కడ వేగం, కొత్త ఆలోచనలు, అద్భుతమైన వద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

**డిజిటల్ విప్లవం – పర్యాటక భాగస్వామ్యుల కోసం ఏపీటీప ప్రారంభం:**

పర్యాటక భాగస్వాముల కోసం ఆంధ్రప్రదేశ్ ట్రావెల్ పార్ట్ నర్ రిజిస్ట్రేషన్ అనే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఇది పారదర్శకతను పెంచడమే కాకుండా,పర్యాటక శాఖతో నేరుగా సమన్వయం, డేటా అనలిటిక్స్ అంతర్జాతీయ వేదికలపై ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని ఆకాంక్షించారు. అలాగే 100కు పైగా 'అనుభవ కేంద్రాల' ద్వారా 20,000 మంది కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. 20 కొత్త ఎక్స్ పీరియన్స్ సెంటర్లను వద్ధిచేస్తున్నామన్నారు.తద్వారా పర్యాటకులకు లీనమయ్యేలా, అత్యంత ప్రామాణికమైన, ప్రత్యక్ష సాంస్కతిక అనుభూతులు అందిస్తామని పేర్కొన్నారు.

**వికసిత్ భారత్ 2047 మాదిరి ఏపీలో స్వర్ణాంధ్ర విజన్ 2047 దిశగా కషి**

తమ టూరిజం పాలసీ స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాన్ని చేరేలా రూపొందించామని మంత్రి దుర్గేష్ వివరించారు. పర్యాటక రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన చేయడం, ఎకానమీ పురోగతికి తోడ్పాటు అందించడమే తమ ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నట్లు భవిష్యత్ లో ఒకే ఒక ఇజం ఉంటుంది అదే టూరిజం అని మంత్రి దుర్గేష్ ఉద్ఘాటించారు.దీంతో సభలో చప్పట్లు మారుమ్రోగాయి. పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, అధికారులు ఇన్వెస్టర్లకు సరైన మార్గదర్శకత్వం అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగానికి సంబంధించిన అన్ని అంశాలను పబ్లిక్ డొమైన్ లో ఉంచామన్నారు. స్నేహపూర్వక పర్యాటక పాలసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఇప్పుడేపుంజుకుంటోందన్నారు. ఈ ప్రయాణంలో టూర్ ఆపరేటర్లు భాగస్వాములు కావాలని కోరుతున్నానని అన్నారు. మన భాగస్వామ్యం ద్వారానే ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల అందాలను కూడా పర్యాటక మ్యాప్‌లోకి తీసుకురాగలమని భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా అరకు కాఫీని ప్రమోట్ చేస్తున్నామన్నారు. అరకు రుచిని చూడాలని కోరారు. పర్యాటకుడు ఒకరోజు పర్యాటక ప్రాంతానికి వస్తే కనీసం 3-5 రోజులు ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భిన్నత్వంలో ఏకత్వం తమ అభిమతం అన్నారు. ఏపీ కేవలం తాము మాత్రమే బాగుపడాలని కోరుకోవడం లేదని అందరూ బాగుపడాలని తమ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా సర్వేజనా సుఖినోభవంతు, సకలజానాభివద్ధే తమ లక్ష్యం, వసుధకై కుటుంబంగా ప్రపంచం ఉండాలన్న వ్యాఖ్యలు ఆసక్తిని కలిగించాయి.ఆంధ్రప్రదేశ్ 'అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా' నేషనల్ ట్రావెల్ మార్ట్ 2026 దేశీయ పర్యాటక రంగంలో ఒక నూతన మైలురాయి అని వక్తలు పేర్కొన్నారు. ఇది ఒక శక్తివంతమైన ఉత్ప్రేరకమని నిరూపించిందని తెలిపారు. ఈ మార్ట్‌లో దాదాపు 700 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని నిర్వాహకులు తెలిపారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి 500 మందికి పైగా బయ్యర్లు, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి 80 మందికి పైగా సెల్లర్లు పాల్గొన్నారని పేర్కొన్నారు. వేల సంఖ్యలో జరిగిన బి2బి సమావేశాల ద్వారా పర్యాటక రంగంలో అర్థవంతమైన వ్యాపార మార్పిడిలు దీర్ఘకాలిక భాగస్వామ్యాలకు పునాది పడిందన్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్, జమ్మూ , కాశ్మీర్, ఉత్తరాఖండ్, అండమాన్, నికోబార్ వంటి దాదాపు అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరై, దీనిని ఒక మినీ ఇండియా పండుగలా మార్చడం విశేషం. ఈ మార్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక విలువ కలిగిన దేశీయ పర్యాటక గమ్యస్థానంగా రూపాంతరం చెందుతున్న తీరును ప్రపంచానికి చాటారు.

### రీసైక్లింగ్ స్టార్టప్ ఇంక్యుబేషన్

# సెంటర్ల ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

వారికి సహకరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ రంగానికి ఎంతో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ట్రియన్ డాలర్ల ఎకానమీ స్థాయికి ఈ రంగం చేరుకుంటుదని చెప్పారు. పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు, వ్యర్థాల నిర్వహణ, కార్పోరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్), శాస్త్రీయ పర్యావరణ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, సంస్థాగత అభివృద్ధి తదితర పలు అంశాలపై ఆప్కాస్ట్ సభ్య కార్యదర్శి, సీఈఓ ప్రొఫెసర్ కె.శరత్ కుమార్ తో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ కార్యక్రమాలను వేగవంతం చేయడం, స్థిరమైన, సమ్మిళిత వృద్ధి కోసం సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడంపై నిర్మాణాత్మకంగా చర్చలు జరిగినట్లు వివరించారు. ముందుగా ఆప్కాస్ట్ సీఈఓ శరత్ కుమార్ చైర్మన్ పట్టాభిరామ్ కు స్వాగతం పలికారు. ప్రాంతీయ కేంద్ర మొత్తాన్ని పట్టాభిరామ్ కలియతిరిగారు. అనంతరం, రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ వ్యాప్తి, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సంస్థాగత అభివృద్ధికి ఆప్కాస్ట్ చేపట్టిన కార్యక్రమాలను శరత్ కుమార్ చైర్మన్ పట్టాభిరామ్ కు వివరించారు. ఆప్కాస్ట్ ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో పారిశుద్ధ్య మౌలిక సదుపాయాల పెంపుదలకు కావలసిన సౌకర్యాలకు సంబంధించి ఒక ప్రతిపాదనను చైర్మన్ పట్టాభిరామ్ కు ఆయన సమర్పించారు.

పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా 'స్వచ్ఛ్ బడి' కార్యక్రమాన్ని స్వీకరించాలని ఆప్కాస్ట్ కౌన్సిల్ ప్రతిపాదించినట్లు తెలిపారు. కౌన్సిల్ లక్ష్యాలను చైర్మన్ పట్టాభిరామ్ మెచ్చుకున్నారు. ఆప్కాస్ట్ సీఈఓ తెలిపిన అన్ని అభివృద్ధి ప్రతిపాదనలకు పట్టాభిరామ్ పూర్తి మద్దతు తెలిపారు. ప్రజారోగ్యం, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఆధునికంగా, సార్వత్రికంగా అందుబాటులో ఉన్న వాష్రూమ్ మౌలిక సదుపాయాల స్థాపనకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఇచ్చిన హామీతో తాము చేపట్టిన కార్యక్రమాలు మరింత నిర్మాణాత్మక పద్ధతిలో అమలవుతాయని ఆప్కాస్ట్ సీఈఓ శరత్ కుమార్ చెప్పారు. తద్వారా శాస్త్రీయ పర్యావరణ వ్యవస్థను సృష్టించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

# 20 నిమిషాల్లో మల్లన్న దర్శనం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. ఉచిత దర్శన క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, శానిటేషన్ సదుపాయాలు, వైద్య సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లలో తాగునీటి సదుపాయం నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి కలుగుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకొని, అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.ప్రత్యేక దర్శనాల కంటే సాధారణ భక్తులకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన సమర్థవంతమైన ఏర్పాట్ల ఫలితంగా సుమారు 20 నిమిషాల్లోనే శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దర్శనం పూర్తి చేయగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉచిత క్యూలైన్ ద్వారా భక్తులకు తక్షణ దర్శనం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. మహాశివరాత్రి వేళల్లో భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులు సంయమనం పాటిస్తూ, శివనామ స్మరణతో, దేవాలయ నియమ నిబంధనలు అనుసరిస్తూ దర్శనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఆ డొమైన్ పేరుకు రూ. 634 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 13:** వెబ్ సైట్ లను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే ఒక డొమైన్ నేమ్ కోట్ల ధర పలికింది. ఆశ్చర్యంగా ఉన్నా కూడా ఇది వాస్తవం. 30 ఏండ్ల క్రితం రూ.300 పెట్టుబడితో కొనుగోలు చేసిన ఒక డొమైన్ ఇప్పుడు రూ.634 కోట్లు పలికిందన్న వార్త సంచలనంగా మారింది. మలేసియాకు చెందిన వ్యాపారవేత్త అరిసాన్ ఇస్మాయిల్ 'ఏఐ.కామ్' డొమైన్ ను క్రిప్టో.కామ్ సీఈఓ 70 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. అంటే సుమారు రూ.634 కోట్లు. ఈ డీల్ ఏప్రిల్ 2025లోనే జరిగింది. అయితే దీనిని సూపర్ బౌల్ ఎల్ఎక్స్ (అమెరికన్ ఫుట్ బాల్ గేమ్) సందర్భంగా రీలాంచ్ చేయడంతో తాజాగా ఈ ఒప్పందం వెలుగులోకి వచ్చింది.

# గిరి ప్రదక్షణ మార్గం శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

హ్యాండ్ క్రాఫ్ట్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, జిల్లా అటవీ శాఖ అధికారి సాయి ప్రసాద్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అగ్రికల్చర్ మార్కెటింగ్ చైర్మన్ చెంచు నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యుల తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్..

ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి అని తెలిపారు. 42 ఆలయాలను గుర్తించి మహా శివరాత్రి పర్వదినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాం అని తెలిపారు. మహా శివరాత్రి హిందూ ధర్మానికి, సనాతన ఆచారాలకు అనుగుణంగా జరుపుకుంటున్నాం అని ఈ సందర్భంగా శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గం ప్రారంభించడం ఆనందం కలిగించిందన్నారు. హిందూ ధార్మిక సంస్థలు, సనాతన ధర్మ పరిరక్షణలో అందరికంటే ఒక అడుగు ముందుండే వ్యక్తి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి ఆధ్వర్యంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం శుభసూచకమని తెలిపారు. కైలాసగిరి ప్రదక్షణ చేసే భక్తుల కోసం మార్గాన్ని ఏర్పాటు చేసి రెండు విభాగాలుగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కూటమి ప్రభుత్వంలో దూప దీప నైవేద్యం స్కీం కింద 5,821 ఆలయాలకు నెలకి రూ. 10 వేల చొప్పున పంపుతున్నామనాన్మని 2027 పుష్కరాల సందర్భంగా పురాతన ఆలయాల పరిరక్షణకు చర్యలు 495 ఆలయాల పునర్నిర్మాణ కార్యక్రమానికి రూ. 608 కోట్లు వెచ్చించి పనులు చేపట్టామని ఏజెన్సీ ప్రాంతాల్లో, వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవాణి ఆలయాల పేరిట టీటీడీ ఆర్థిక సహకారంతో 5 వేల ఆలయాలకి రూ. 750 కోట్లు కేటాయించి చిన్న చిన్న ఆలయాలు నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఇప్పటికి 697 ఆలయాలకు, 113.25 కోట్ల నిధులు మంజూరు చేస్తూ అనుమతులు ఇచ్చాం అని 1516 ఆలయాలకు పాలకవర్గాలు నియమించాల్సి ఉంటే 1,002 నియమించామని, మిగిలినవి కూడా నియామకాలు త్వరలో చేపడతామని గోదావరి పుష్కరాల పేరిట 31 ప్రధాన ఆలయాలను రూ. 37 కోట్లతో అభివృద్ధి చేస్తూ ఆంధ్రప్రదేశ్ ను ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆలయంలో ధర్మ పరిరక్షణకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని అని తెలిపారు. దేవదాయశాఖ మంత్రి అనంత రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయ్యప్ప దేవాలయం, లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం (రూ.3.70 కోట్లు), కోటకుండ-కొత్తపాలెం రోడ్డు (రూ.4 కోట్లు), వాడపల్లి, ఏడు వాగల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి గోదావరి కరకట్ట రోడ్డు (రూ.4 కోట్లు) వంటి పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ నిధులతో సుమారు 22 ప్రధాన దేవాలయాలకు రోడ్లు, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చిన్న ఆలయాలకు కూడా రవాణా సౌకర్యాల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తగా ఎన్నికైన ట్రస్ట్ బోర్డు సభ్యులైన 17 మందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఆలయ అభివృద్ధి, సంస్క ృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సుమారుగా 22 కిలోమీటర్లు కలిగిన ఈ గిరిప్రదక్షిణ మార్గం భక్తులందరికీ ఎంతో అనుకూలంగా రోడ్డు పనులను పూర్తి చేసి భక్తులందరికీ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. స్వామి అమ్మవార్లు ప్రతి కనుమ పండుగ, శివరాత్రి నాడు గిరిప్రదక్షిణ మార్గాన తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ప్రతి నెల పౌర్ణమి రోజు భక్తుల ఎక్కువ మంది ఈ రోడ్డు మార్గాన్ని ఉపయోగించుంటారు అని అన్నారు. గత శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆ ఒక్క రోజునే సుమారు 35 వేల మంది భక్తులు ఈ గిరి ప్రదక్షిణ చేశారన్నారు. అదే విధంగా 22 కిలోమీటర్ల మొత్తానికి భక్తుల సౌకర్యార్థం రాత్రి సమయంలో ఇబ్బందులు కలగకుండా బోర్డు ద్వారా రోడ్డు మార్గానికి స్ట్రీట్ లైట్స్ , మరుగు దొడ్లు, త్రాగు నీటి సదుపాయం, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గిరి ప్రదక్షిణ మార్గమును భక్తులు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడే వాళ్ళని అలాంటి పరిస్థితిలో గిరి ప్రదక్షణ రోడ్డు మార్గమును భక్తులకు సౌకర్యార్థం అన్ని సౌకర్యాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందని చాలా సంతోషంగా ఉందని భక్తులు తమ మనోభావాలు తెలియజేశారు...

ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాలే బిజెపి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ శిక్షణ ఉద్దేశం. ఏకాత్మమానవతదర్శనం ద్వారా మన మూల సిద్ధాంతం ప్రశిక్షణ ద్వారా ప్రతి కార్యకర్త కు తెలియజేయాల్సిన అవసరం ప్రారంభ సమావేశంలో జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ జీ,దక్షిణాది రాష్ట్రాల ప్రశిక్షణ మహాభియాన్ ఇంచార్జి కాసంవెంకటేశ్వర్లు, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి వేదిక ను అలంకరించారు.ఆంధ్రప్రదేశ్, లో పార్టీ కార్యక్రమాలు చాలా అద్భుతంగా జరుగుతున్నాయని దక్షిణాది రాష్ట్రాల ప్రశిక్షణ మహాభియాన్ ఇంఛార్జి కాసంవెంకటేశ్వర్లు కొనియాడారు. డి నోటిఫైడ్ ట్రైబ్స్, విశ్వకర్మ, నాదస్వరం వారి సమస్యలు పై బిజెపి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రశిక్షణ పై కాసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రశిక్షణ వివరాలను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి వివరించారు. అనంతరం జోన్ లు వారి గా సమావేశం ఏర్పాటు చేసి ప్రశిక్షణ మండలస్థాయి లో నిర్వహించేందుకు సమీక్ష నిర్వహించారు. ప్రశిక్షణ ముగింపు సమావేశంలో జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ జీ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తల శిక్షణే కీలకం ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముందుకు సాగాలని ప్రధానంగా భారీ సభ్యత్వం పార్టీకి దేశవ్యాప్తంగా సుమారు 14 కోట్ల మంది సభ్యులు 11 లక్షల బూత్ కమిటీలు మరియు 17,700 మండల కమిటీలు ఉన్నాయని ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు స్థానిక సంస్థల ప్రతినిధుల సంఖ్య పరంగా ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ, కార్యకర్తలలో నాణ్యత లేకపోతే పార్టీ ఆశించిన రీతిలో నడవదని మూలాలు హెచ్చరిస్తున్నాయని

తానా-బానా సూత్రం వస్త్రాన్ని నేసేటప్పుడు నిలువు మరియు అడ్డు దారాలు (తానా-బానా) రెండూ సరిగ్గా ఉంటేనే ఆ వస్త్రం నాణ్యంగా ఉంటుంది . ఏదైనా ఒక దారం సరిగ్గా లేకపోయినా ఆ వస్త్రం మార్కెట్లో చెల్లదని

అదేవిధంగా, పార్టీలో సంఖ్యతో పాటు కార్యకర్తల ప్రవర్తన, పని సామర్థ్యం మరియు సిద్ధాంతాల పట్ల అవగాహన ఉండాలి

₹శిక్షణ ప్రాముఖ్యత: సమాజంలో మార్పు తీసుకురావడానికి, పేదల సంక్షేమం మరియు దేశాభివృద్ధి (రాష్ట్ర ఉత్థాన్) లక్ష్యంగా పనిచేసేందుకు కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అనువాయితీ గా వస్తోంది అన్నారు ఈ కార్యక్రమానికి మంత్రి సత్య కుమార్ యాదవ్, బిజెపి శాసన సభ పక్ష నేత విష్ణు కుమార్ రాజు,ఎమ్మెల్యే లు కామినేని శ్రీనివాస్, డాక్టర్ పార్థసారథి, ఎన్ ఈశ్వర రావు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లు నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీ నివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధా రాజు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా,యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు



# భయపడేది లేదు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 13:** వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఓవైసీ కళ్లలో ఆనందం కోసమే జీహెచ్ఎంసీని ముక్కల చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి పాలిట అదే మరణ శాసనం కాబోతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీ 30 డివిజన్లను కైవసం చేసుకుంది. దీనిపై కరీంనగర్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు.

తెలంగాణలో తొలిసారి కరీంనగర్ కార్పొరేష్న కాషాయ జెండా ఎగరేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు పట్టించుకో లేదన్నారు. కాంగ్రెస్తో సంసారం చేస్తూ బీఆర్ఎస్కు కన్ను కొడుతున్న ఎంఐఎంను ప్రజలు చెంప చెళ్లుమన్పించారని చెప్పారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా కరీంనగర్ను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

# అందుకే.. పంచశీల ఒప్పందం

**డెహ్రాడూన్, ఫిబ్రవరి 13:** స్వాతంత్ర్యం తర్వాత భారత్-చైనా సంబంధాల గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కోసమే అప్పటి భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 1954లో పంచశీల ఒప్పందం చేసుకొని ఉంటారన్నారు. డెహ్రాడూన్ లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎస్.. భారత్-చైనా చారిత్రక సంబంధాలపై ప్రసంగించారు. ఆ ఒప్పందంలో భాగంగానే టిబెట్ ను చైనాలో భాగమని భారత్ గుర్తించిందన్నారు. 'బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత.. సరిహద్దు ప్రాంతాలను నిర్ణయించుకునే అవకాశం భారత్కు వచ్చింది. తూర్పున మెక్మోహన్ రేఖ, లద్దాఖ్లోని ప్రాంతాల గురించి నెహ్రూకు అవగాహన ఉండి ఉండొచ్చు. కానీ, ఈ ప్రదేశంపై (టిబెట్ సరిహద్దు ప్రాంతం) కాదు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందంపై ముందుకెళ్లారని భావిస్తున్నా. ఇదే చైనీయుల విషయానికొస్తే.. టిబెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వారు సరిహద్దుల నుంచి లాసా (టిబెట్లోని నగరం), షిన్జియాంగ్ లకు వెళ్లిపోయారు.

ఈ ప్రత్యేక ప్రాంతం రెండు దేశాలకు ఎంతో ముఖ్యమైనదిగా మారింది. అందుకే చైనీయులు ఇక్కడ స్థిరత్వాన్ని కోరుకున్నారు. ఆ సమయంలో భారత్ కూడా చైనాతో మంచి సంబంధాలు కొనసాగించాలని భావించింది. ఈ క్రమంలోనే 1954లో టిబెట్ను చైనాలో భాగంగా గుర్తించింది. పంచశీల ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి'' అని సీడీఎస్ చౌహాన్ వివరించారు. పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో భారత్-చైనాల మధ్య 1954లో పంచశీల ఒప్పందం (ఐదు సూత్రాలు) జరిగింది. నాటి భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్లైలు సంతకాలు చేశారు. అయితే, చైనా వైఖరి చూస్తుంటే ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమేనని అర్థమవుతోందని.. సరిహద్దు అంశంలో ఇది ఏమాత్రం ప్రతిబింబించలేదని సీడీఎస్ అభిప్రాయపడ్డారు.

# పీఎంఓ కొత్త భవనం 'సేవా తీర్థ్' ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అవర్లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో దీనిని ప్రారంభించడం విశేషం. రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రి వారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజుల వరకు ఈ సేవలు పొందొచ్చని గతంలో కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.

ఈ పీఎం రాహత్‌తో ప్రారంభంతో పాటు.. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు నిధులను రూ.2 లక్షల కోట్లకు పెంచారు. దేశ స్టార్టప్ వ్యవస్థను వేగవంతం చేసేందుకు రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు ఫైలుపై మోడీ సంతకాలు చేశారు.




# ఈ నెల 14న రైజ్లో ప్రత్యేక వర్క్‌షాప్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,మనం న్యూస్:** మహిళామణులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్షిప్ సెంటర్ (రైజ్)లో ప్రత్యేక జాగృతి వర్క్షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

శీతలీకరణ, కిచెన్ అండ్ ఫుడ్ ఎక్విప్మెంట్ తయారీలో సుదీర్ఘ అనుభవం కలిగిన కూలెక్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (విజయవాడ) భాగస్వామ్యంతో ఈ వర్క్షాప్ ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సూక్ష్మ, చిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులు, చిన్నస్థాయి వ్యాపార అభివృద్ధికి ప్రయోజనం కల్పించేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ అవగాహన, శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గుంటుపల్లితో సహా ఇబ్రహీంపట్నం మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు ఔత్సాహిక మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



# తిరుపతి అభివృద్ధికి సహకరించండి



- పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే ఆరణి వినతి

**తిరుపతి, ఫిబ్రవరి 13 మనం న్యూస్ :** తిరుపతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చేయూత నివ్వాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వినతి పత్రం శుక్రవారం అందించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరం విస్తరించిందని కావున మౌళిక సదుపాయాలు జనాభాకు తగ్గట్టు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన భవనం( సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం ) పనులు గత ప్రభుత్వ నిర్వాకంతో నిలిచిపోయాయని దీన్ని పూర్తి చేసేందుకు యాభై కోట్ల రూపాయలు మంజూరు చేయించాలని పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే కోరారు. అలాగే ఆర్టీసి సెంట్రల్ బస్టేషన్ స్థానంలో ఈపిసి విధానంలో ఇంటర్ మోడల్ స్టేషన్ నిర్మాణానికి సహకరించాలని ఆయన పవన్ కళ్యాణ్ ను కోరారు. నగరంలో ముప్పయ్ ఏళ్ళక ముందు నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ నిత్యం లీకేజీలతో మురుగునీరు రోడ్లపై ప్రవహించే పరిస్థితి నెలకొందని ఎమ్యెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. జనభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని అమృత్ 2.0 పథకం కింద నూతన యూజిడి వ్యవస్థ కోసం 284 కేంద్రంతో చర్చించి నిధులు ఇప్పించాలని పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే కోరారు. తిరుపతి కార్పొరేషన్ లో తాగునీటి సరఫరా నెట్వర్క్, నిల్వ సామర్థ్యాల బలోపేతానికి ఎనభై ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేయించాలని పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే కోరారు. అలాగే కార్పొరేషన్ లో సమగ్ర వర్షపు నీటి డ్రైనేజీ వ్యవస్థ కోసం 101 కోట్లు మంజూరు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా తిరుపతి నగరంలో కేవలం టిటిడికి చెందిన జూనియర్, డిగ్రీ కాలేజీలు మాత్రమే ఉన్నాయని పవన్ కళ్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్ళారు. కాబట్టి పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉపయోగపడేలా జూనియర్, డిగ్రీ కాలేజీలు ప్రభుత్వం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు తెలిపారు.



## వ్యాఘ్ర వాహనంపై సోమస్కందమూర్తి

**తిరుపతి, ఫిబ్రవరి 13 మనం న్యూస్ :** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం ఉదయం శ్రీ సోమస్కంధమూర్తి వ్యాఘ్ర వాహనంపై అనుగ్రహించారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తి వ్యాఘ్రుం వంటిది. భక్తితో ఏ జీవుడి హృదయం శివునికి వేదికవుతుందో ఆ జీవుడి క్రూరపాపకర్మలు, మదమోహ, మాత్సర్యాదులు సంహరించబడతాయి. వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో గా భక్తులు పాల్గొన్నారు.

## రూల్స్ పాటించని అధికారుల వివరాలు ఎందుకు చెప్పడం లేదు?

### హైకోర్టు ఆగ్రహం

**అమరావతి మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి :** విశాఖజిల్లా, భీమునిపట్నం పరిధిలో సిఆర్ జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా తీరానికి సమీపంలో కాంక్రీట్ గోడ నిర్మాణం జరుగుతోందని తెలిసి కూడా చర్యలు తీసుకోని అధికారులపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇలాంటి అధికారులను రక్షించేందుకు జివిఎంసి కమిషనర్ ప్రయత్నిస్తున్నారని అభిప్రాయపడింది. బాధ్యులైన అధికారుల వివరాలివ్వాలని కోరితే కమిషనర్ ఇవ్వలేదని ఆక్షేపించింది. వాళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. అలాగే గోడ కూల్చడం ద్వారా పోగైన వ్యర్థాలను మూడువారాల్లో తొలగించాలని జివిఎంసి కమిషనర్ను చీఫ్ జస్టిస్ దీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావు తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలిచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సిఆర్ జెడ్-1 ప్రాంతంలో సము ద్రానికి అతిసమీపంలో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్పీ శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేయడంపై జనసేన కార్పొరేటర్ పిఎల్వీఎన్ మూర్తి యాదవ్ వేసిన ప్పి తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎక్కడా చిన్నపొరపాటుకూ తావులేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,మనం న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీవోఎస్ఎస్) ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయ శాఖల అధికారులు బృంద స్ఫూర్తితో వ్యవహరించి.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో ఓపెన్ ఇంటర్ పరీక్షలపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సమన్వయ శాఖల సమావేశం జరిగింది. పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మార్చి 2 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీవోఎస్ఎస్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. విజయవాడ డివిజన్కు సంబంధించి 603 మంది, నందిగామకు సంబంధించి 882 మంది, తిరువూరుకు సంబంధించి 369 మంది మొత్తం 1,854 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీటికోసం 11 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లను నియమించడం జరిగిందన్నారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం అవసరమన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ల ఏర్పాటుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రజా రవాణా అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. నో సెల్ఫోన్ జోన్ నిబంధనలకు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సన్నద్ధంగా ఉండాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యంపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి సన్నద్ధతతో ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## స్వర్ణరథంపై శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి కటాక్షం

### పెద్ద సంఖ్యలో రథాన్ని లాగిన మహిళలు

**తిరుపతి, ఫిబ్రవరి 13 మనం న్యూస్ :** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణరథోత్సవం కన్నులపండుగగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు ధగధగ మెరుస్తున్న స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి శ్రీభూదేవులు ఇరువైపుల ఉంటారు. శ్రీదేవి(లక్ష్మి) బంగారు. స్వర్ణరథం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనది.ఈ స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల- లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ; భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని విశ్వాసం. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్ కుమార్ , కంకణభట్టర్ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు ముని కుమార్, ధన శేఖర్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన 'స్వదేశీ జాగరణ మంచ్' జాతీయ కన్వీనర్ సుందరం

### జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక విధానాలపై ప్రసంగం

**శ్రీసిటీ, ఫిబ్రవరి 13, మనం న్యూస్ :** భారతదేశ ఆర్థిక భవిష్యత్తు దేశీయ సామర్థ్యాల బలోపేతం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, విధాన స్థిరత్వంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, ఆర్థిక నిపుణులు, స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం పేర్కొన్నారు. పన్నులు, కార్పొరేట్ చట్టం, ఆర్థిక విధానంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవమున్న ఆయన శుక్రవారం శ్రీసిటీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.



అతిథికి సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మారుతున్న విధానాలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమ వర్గాలను చైతన్యవంతులను చేయడానికి సంబంధిత నిపుణులతో తరచూ ఈ తరహా కార్యక్రమాల నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. 'మారుతున్న గ్లోబల్ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై ప్రసంగించిన సుందరం, ప్రధానంగా ప్రపంచ ఆర్థిక పరిణామాలు మరియు భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక బలాలను ప్రస్తావించారు. స్వావలంబన, స్వయం సమృద్ధి, బలమైన సరఫరా గొలుసులు, దేశీయ విలువ సృష్టి ప్రాధాన్యతను వివరించిన ఆయన, దేశ పురోగాభివృద్ధిలో బలమైన పరిశ్రమ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిశ్రమలకు సాధికారత కల్పించడం మరియు విధానాలు, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ప్రపంచ అవకాశాలతో సమన్వయం చేయడంపై భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక బలం ఆధారపడి ఉంటుందన్నారు. పోటీతత్వం, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిని కొనసాగించడానికి అధునాతన తయారీ, డిజిటల్ సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలు, వ్యవసాయ సాంకేతికత మరియు బలమైన మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన పలువురు సీఈఓలు, ఉన్నతాధికారులు పాల్గొని, భారత తయారీ, వాణిజ్యం, పెట్టుబడులపై గ్లోబల్ ఆర్థిక మార్పుల ప్రభావం అంశాలపై పరస్పర చర్చలు జరిపారు. నూతన వ్యాపార అవకాశాలు, సవాళ్ల పట్ల అభిప్రాయాలు పంచుకున్నారు.

## శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**శ్రీశైలం / నంద్యాల్ల, ఫిబ్రవరి 13 మనం న్యూస్ :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించబడనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాన్ కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. పాగా అలంకరణ దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లను, భక్తుల రాకపోకల మార్గాలను, భద్రతా చర్యలను కలెక్టర్ మరియు ఎస్పీ సమగ్రంగా తనిఖీ చేశారు. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా బందోబస్తు తదితర అంశాలపై పోలీసు శాఖతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. భక్తుల ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలు అనుసరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, రెవెన్యూ, పోలీసు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



**మంత్రాలయం , ఫిబ్రవరి 13,మనం న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని తహాశీల్దార్ రమాదేవి , ఆర్ ఐ జనార్ధన్ రావు , వీఆర్వో భీమన్న గౌడ్ , యంఈఓ రాఘన్న శుక్రవారం పరిశీలించారు. తహాశీల్దార్ మాట్లాడుతూ గ్రామ సర్వే నంబర్ 164,164ఈ1,164 సీడీ1, ఈ1ఎలో భూమిలో కొంతమంది అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా గుడిసెలు,బండలతో నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు రావడం తో అందులో భాగంగా విచారణ రావడం జరిగిందన్నారు. అప్పట్లో1.54 ఎకరా 54 సెంట్లు మిగిలి ఉంది.భూమి మాత్రం ఎవరు అందులో నివాసలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ భూమి లో సుమారు పదిమంది మాత్రం అక్రమంగాస్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపైనే హైకోర్టులో రిట్ పిటిషన్ వఆ భూమిలో ఒక్కరు మాత్రమే నివాసం ఉంటున్నారని మిగతా ప్రాంతమంతా ముళ్లపదలతో నిండి ఉందని తెలిపారు. ఆ రిట్ పిటిషన్ వేసిన వారికీ,పక్క ఇల్లు ఉన్నాయని, అధికారులు కోర్టుకు విన్నవించారు.భూమి లోకి ఎవరు వెళ్లకుండా ఉండాలని తీర్పునిచ్చింది. కానీ తీర్పులను పట్టించుకోకుండా ప్రభుత్వ భూమిలో గుడిసెలు నిర్మాణానికి, నాపరాతి బండలు పారుతున్నారు, వామదొడ్లు వేశారు,ఈ విషయం మండల తాసిల్దార్ కి రావడంతో, వివరాలు సేకరించాలని, అరే జనార్ధన్ రావు వీఆర్వో భీమన్న గౌడ్ ని ఆదేశించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమించుకున్నది వాస్తవమైనని వివరాలు సేకరించారు. అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు తెలిపారు.

## సీఎం ఆశయాలకు గండి?

**చింతూరు వెలుగు శాఖలో రూ.1.30 కోట్లు అక్రమాల ఆరోపణలు**

**270 డ్వాక్రా సంఘాలకు రుణాల నిలిపివేత.**

**చంద్రబాబు విజన్కు విరుద్ధంగా స్థానిక అధికారుల వ్యవహారం?**

**కలెక్టర్ జోక్యంతోనే ఈ సమస్యకు పరిష్కారం**

**ఆ దిశగా అడుగులు పడతాయా ?**

**చింతూరు (మనం న్యూస్ ) ఫిబ్రవరి 13 :** నారా చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతే లక్ష్యంగా డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి తక్కువ వడ్డీ రుణాలు, పావుల వడ్డీ నుంచి ఉచిత వడ్డీ విధానాల వరకూ అనేక సంస్కరణలు తీసుకువచ్చి రాష్ట్రంలో లక్షలాది గృహిణులకు ఆర్థికంగా భరోసా నిచ్చి మహిళా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సదుద్దేశంతో ఈ డ్వాక్రా సంఘాల రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. మహిళలు వంటింటి కుందేలు కాదు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా నిలబడే తెలుగు మహిళ అనే దృక్పథంతో అమలు చేసిన పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. అయితే చింతూరు మండలంలో వెలుగు శాఖలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న సుమారు రూ.1.30 కోట్ల అక్రమాల కారణంగా దాదాపు 270 డ్వాక్రా సంఘాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. సుమారు 2700 మంది పేద మహిళలు గత నాలుగేళ్లుగా రుణాలు అందక ఆర్థికంగా కుంగిపోయిన పరిస్థితి నెలకొంది.

### 2020 నుంచి రుణాల నిలిపివేత?

స్థానిక సంఘాల సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం 2020 సంవత్సరం నుంచి శ్రీనిధి లేదా ఇతర ఆర్థిక వనరుల ద్వారా కొత్త రుణాలు అందలేదని చెబుతున్నారు.ఈ రుణాల చక్రం ఆగిపోవడంతో చిన్న వ్యాపారాలు మూతపడి, బతుకుబండిని లాగడం కష్టమవుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మూడు కమిటీలు చర్యలు ఎక్కడ?

ఈ వ్యవహారంపై ఇప్పటికే మూడు కమిటీలు ఏర్పాటు చేసి విచారణలు జరిపినట్లు సమాచారం. అయితే విచారణలు తూతూ మంత్రంగా ముగిసిపోయాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమందిని ఆరు నెలలు సస్పెండ్ చేసి తిరిగి విధుల్లో చేర్చినా, నష్టపోయిన సొమ్ము రికవరీపై స్పష్టత లేకపోవడం గమనార్హం.

### 270 సంఘాల ఆశలు అడియాశలుగా?

తెలుగుదేశం ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన డ్వాక్రా మహిళల ఆశలు నెరవేరలేదని వారు అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ముఖ్యమంత్రి ఆశయాలు, లక్ష్యాలను తుంగలోకి తొక్కుతున్నారా ?లేదా తెలుగుదేశం, కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికి ఇటువంటి పనులు చేస్తున్నారా అన్న ప్రశ్న స్థానికంగా చర్చనీయాంశమైంది.

### కలెక్టర్ స్థాయి జోక్యం అవసరం

ఈ అంశంపై కలెక్టర్ స్థాయి అధికారి జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. సుమారు 2700 మంది పేద మహిళల భవిష్యత్తు దీనిపై ఆధారపడి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి విజన్కు అనుగుణంగా వ్యవస్థ పనిచేయాలంటే స్థానిక స్థాయిలో పారదర్శకత, బాధ్యత తప్పనిసరి. చింతూరు మండలంలోని వెలుగు శాఖ వివాదంపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేస్తారా? లేక మహిళల ఆశలు మరోసారి అడియాశలుగానే మిగిలిపోతాయా? అన్నది వేచి చూడాలి.

### అంకితం

ఆమె నా ప్రాణం..
నా ఏకాంతలోకం..
ఉవ్వెత్తున లేచే కడలి అలల వంటి

నా కష్టాలకు నిశ్చల తీరం!
అలసటను తరిమేసే
ఏకైక తారక మంత్రం ఆమె
మా వీధి మలుపులో వేచి చూసే

ఆమె కళ్ళవెలుగు..
ఆ వెలుగుకు తోడయ్యే పెదవిపై చిరునవ్వు..
ఎడారి లాంటి నిరుపేద బతుకున
నిండు పున్నమి వెన్నెల సోన!

వెట్టి చాకిరీ సముద్రంలో
నేను మునగకుండా
ఒడ్డుకు చేర్చే ఆశల పడవ
ఆమె చెలిమి!

లోకం నన్ను
వెలకట్టే పనిముట్టుగా చూసినా..
నన్ను మనిషిగా గుర్తించే
ఏకైక మనసు తనది!

రోజంతా పని చేశాక
చేతిలో కూలి డబ్బు పడగానే
మనసు ఆగదు!

చిన్న కానుకనో, ఇష్టమైన పువ్వునో..
ఏదైనా సరే, నా కష్టార్జితమంతా
ఆమె పెదవులపై విరిసే
చిరునవ్వుకే అంకితం!


లక్షల ధనం ఉన్న సిరిమంతుడిని కాకపోవచ్చు
గానీ
నా జేబులోని ప్రతి పైసా..
ఆమె కళ్ళలో మెరుపు చూడటానికే
తహతహలాడుతుంది!

లోకం ఎప్పుడూ ఇంతే..
కలిసి నడిచే జంటను చూస్తే
వెక్కిరింతలు,
పేదవాడి ప్రేమంటే ఎగతాళి

కానీ,
ఈ ఇరుకు సందుల ఈసడింపులకు
అందని దూరంలో..
మాకంటూ ఒక సరికొత్త
స్వతంత్రలోకాన్ని నిర్మించుకుంటాం!

డబ్బుతో కొనలేని నా ప్రతి శ్వాస..
ఆమె ఆనందానికే అంకితం!

**- విల్సన్ రావు కొమ్మవరపు**
8985435515



### ఓ వామ లోచనీ...

సాగరతీరాన-
సౌందర్యానికి నిర్వచనం చెబుతున్న తీరున
వయ్యారంగా నిలబడి,
ఆ సాగరకెరటాలతో పోటీపడుతూ,
ఎగిరిపడుతూన్న నీ ఉంగరాల ముంగురులను
నీ వామహస్తాంగుళులతో
వెనక్కు సుతారంగా
దువ్వుకుంటూన్న
ఓ వామలోచనీ...!

నా కోసం అభిసారికవై వచ్చిన నీవు-
పది క్షణాల నా ఆలస్యానికి
అలుకల సత్యభామవై
చిరు అలుకతో ముఖం తిప్పుకుని
సాగరం వైపుకు చూడకు!

ఎందుకంటే... నీ కళ్ళను చూసి
రెండు పౌర్ణమిచంద్రబింబాలని భ్రమపడి
ఆ సాగరం- పగలే రెట్టింపు ఉత్సాహంతో
ఉప్పొంగుతుంది సుమా!

చిరుకోపానలంతో ఉడికిపోతూన్న నీవు
వేడినిట్టూర్పులు విడవకు మరి...
ఎందుకంటే- నీ ఆ చిట్టినిట్టూర్పులకే
సాగరం- ఆటుపోట్లతో అల్లకల్లోలం
అవగలదు సుమా!
నీ కళ్ళ సూర్యుళ్ళ ప్రళయకోపతాపాలనూ,
నీ కళ్ళ చంద్రుళ్ళ ప్రణయప్రసన్నచంద్రికలనూ
నా పైనే కురిపించు కువలయనేత్రీ...!
ఎందుకంటే... వాటిపై హక్కు లన్నీ నావే నని
నా ఎదకాగితంపై నీ వలపుల తొలిసంతకం
చేసివున్నా వనీ
మరిచిపోకు హేమసుందరగాత్రీ!!!

**- 'రఘువర్మ'**
9290093933

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# హక్కులను చిదిమేస్తున్న బాల్య వివాహాలు

'పెళ్లి' రెండక్షరాల చిన్న పదమైనప్పటికీ, వ్యక్తి జీవితాన్ని మూడొంతులు మోసే తంతు. బాల్యాన్ని మరిపింపజేసి, తోడు దొరికే విలువైన జీవనానికి పాదు. ఉన్నత చదువు ముగించుకుని, ఉద్యోగంలో స్థిరపడి, తర్వాత పెళ్లి గురించి ఆలోచించేందుకు ఓ నిర్దిష్టమైన వయస్సును కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈమేరకు కనీస వివాహ వయస్సు యువతికి 18, యువకుడికి 21 ఏళ్లు ఉండాలని చట్టం చేసింది. కానీ, ఈ చట్టానికి తిలోదకాలిస్తూ బాల్య వివాహాలు జరిగిపోతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం గతంతో పోలిస్తే మన దేశంలో బాల్య వివాహాలు తగ్గాయి. అయితే గ్రామీణ, తక్కువ ఆదాయ కుటుంబాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ప్రాంతాల వారిగా తేడాలు ఉన్నప్పటికీ, నివేదిక స్థూలంగా ఆశాజనకమైన అంకెలను అందించింది. బాలికల్లో 25 శాతం, బాలురుల్లో 15 శాతం వరకు కనీస చట్టబద్ధ వయస్సు రాకముందే పెళ్లి జరిగిపోతున్నట్లు 2019-21 సర్వే స్పష్టం చేసింది. గత సర్వేలతో పోలిస్తే బాల్య వివాహాల సంఖ్య తగ్గినప్పటికీ, కోవిడ్-19 ప్రభావంతో బాల్య వివాహాల శాతం కొంతమేరకు పెరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. శారీరక వృద్ధి, మానసిక, భావోద్వేగాల పెరుగుదల, విద్యావకాశాలపై తీవ్ర ప్రభావం చూపించిన బాల్య వివాహం, పిల్లల హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. ఆట పాటలతో గడిపే స్వేచ్ఛా జీవితాన్ని హరించడమవుతుంది. మానసిక పరిపక్వత రాని వయస్సులో పెళ్లి చేయడం వల్ల బరువైన బాధ్యతలు మీదపడి వొంటరితనం, కుంగుబాటుకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సామాజిక ఆచారాలు, విశ్వాసాలు, దారిద్ర్యం వంటివి బాల్య వివాహాలకు ప్రధాన కారణమవుతున్నాయి. పెద్దగా చదువు లేకపోవడం, విద్యావకాశాలు లేని ప్రాంతాల్లో ఈ వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రజస్వల అయితే చాలు, పెళ్లీడు వచ్చిసినట్లేనని తల్లిదండ్రులు భావించడం, వారిలో అవిద్య, వలసలు, గిరిజన ప్రాంతాలు, కుటుంబంలో అధిక సంఖ్యలో ఆడపిల్లలు ఉండటం వంటివి బాల్య వివాహాలకు ప్రేరకాలుగా నిలుస్తున్నాయి.

జన జీవితాలను అతలాకుతలం చేసిన కరోనా... పేద కుటుంబాల్లోని బాలికల ఆశలను చిదిమేసింది. ఉన్నత చదువుతో జీవితంలో స్థిరపడాలని కన్న కలలు ఆవిరయ్యాయి. కరోనా వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు తలకిందులైన స్థితిలో తల్లిదండ్రుల మాటను కాదనలేక పెళ్లిపీటలెక్కిన ఉదంతాలు ఎక్కువగానే చోటు చేసుకున్నాయి.'లాక్డౌన్'నిబంధనలతో వివాహ ఖర్చులు గణనీయంగా తగ్గడంతో ఈ కాలంలో కొంతమంది తల్లి




దండ్రులు అవకాశంగా భావించారు. దీంతో బాల్య వివాహాలను అరికట్టడంలో అంతర్జాతీయ సంస్థలు 25 ఏళ్లుగా చేసిన కృషి దూరమై, పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. సామాజిక, ఆర్థిక పరిస్థితులు, పాఠశాలలు మూతపడటం, కరోనా సాకుగా చూపించి తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేసినట్లు తెలుస్తోంది. 13 నుంచి 16 ఏళ్ల వయస్సు వారికి పేద కుటుంబాల్లో ఈ వివాహాలు జరిగాయి. వైరస్ వ్యాప్తితో సొంత ఊర్లకు తిరిగివచ్చిన కొంతమంది తమ ఆడపిల్లల పెళ్లి కోసం అప్పులు చేయకుండా తక్కువ ఖర్చుతో పెళ్లి అవుతుందని వయస్సుతో సంబంధం లేకుండా వివాహాలు జరిపించారు. కోవిడ్ మొదలైన నాటి నుంచి ఏడాది పాటు వేల సంఖ్యలో తెలంగాణ రాష్ట్రంలోనూ బాల్య వివాహాలు జరిగాయి. బాధితులు, ఇరుగు పొరుగు వారిచ్చిన సమాచారం మేరకు కొన్ని ప్రాంతాల్లో అధికారులు బాల్య వివాహాలను నిలిపి వేయించారు. అడ్డుకున్న వాటి కంటే గుట్టుగా జరిగిపోయినవే ఎక్కువ ఉన్నాయని సంబంధిత అధికారులు అంచనా వేశారు. అయితే గతంతో పోలిస్తే 27 శాతం అధికంగా బాల్య వివాహాలు జరిగినట్లు తేల్చారు.

బాల్య వివాహాల నిరోధ చట్టం అమలులో ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచి, గ్రామ కార్యదర్శి, అంగన్వాడి సిబ్బంది బాల్య వివాహాలను అడ్డుకునే వీలున్నా, స్థానిక వొత్తిడులు, దాడులకు భయపడి వెనుకడుగు వేస్తున్నారు. వివాహాలను అడ్డుకున్నాక ఆ బాలికల సంరక్షణ కమిటీ(సీడబ్ల్యూసీ) ముందు ప్రవేశపెట్టి వాంగ్మూలం నమోదు చేస్తున్నప్పుడు తమకు చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నా, తల్లిదండ్రుల మాట కాదనలేక పెళ్లికి ఒప్పుకుంటున్నట్లు తెలియజేస్తున్నారు. కొందరు తమ కూతురు వయస్సు 18 ఏళ్లుగా నిరూపించేలా తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారు. ఆధార్కార్డులో పుట్టిన తేదీని మార్చుతున్నారు. తల్లిదండ్రుల సొంత నిర్ణయాలతో ఆడపిల్లలు బలవంతపు వివాహ బంధంలో చిక్కుకుపోతున్నారు. సామాజిక కట్టుబాట్లు, వరకట్నం, కుటుంబాల్లో లింగ వివక్ష కారణంగా తల్లిదండ్రుల నిర్ణయాలకు ఆడపిల్లలు తలవొంచుతున్నారు. చాలా మందికి పెళ్లిపీటల మీదకు వచ్చే వరకూ కాబోయే భర్తతో తమ అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం ఉండటం లేదు. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలను నివారించడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని భారత్‌లో బాల్య వివాహాల నిర్మూలన అధ్యయన నివేదికలో యూనిసెఫ్ ఇదివరకే స్పష్టం చేసింది. 18 ఏళ్లలోపు వివాహాలైన వారిలో 45 శాతం మంది భర్త ఎంపికలో తల్లిదండ్రులమాటకు ఎదురు చెప్పలేకపోవడం, మరో45 శాతం మంది కుటుంబ సభ్యుల మాటను శిరసా వహించడం బాల్య వివాహాలకు కారణమవు తున్నాయి. కటిక పేదరికానికి చెందినవారిలో 36 శాతం, పేద రికంలో 30 శాతం, మధ్యతరగతివారిలో 24 శాతం, ఎగువ మధ్యతరగతిలో 16, ధనిక వర్గాల్లో 5 శాతం మేరకు బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బాల్య వివాహాలకు గురవుతున్న వారిలో చదువులేనివారు 45 శాతం ఉండగా, ప్రాథమిక విద్య ఉన్నవారు 40 శాతం, మాధమిక విద్యలో ఉన్నవారు 23 శాతం, ఉన్నత విద్యకు చెందిన బాలికలు 3 శాతం వరకు ఉన్నారు. వివాహ వయస్సు వచ్చిన తర్వాత పెళ్లిళ్లు చేసుకున్నవారు కుటుంబ పనుల్లో నిమగ్నమవుతుండగా, బాల్య వివాహాలు చేసుకున్నవారు భర్తతో కనీస అభిప్రాయాలు చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉండి శారీరక మానసిక హింసకు గురవుతున్నట్లు నివేదకలో పేర్కొంది.

బాల్య వివాహ దురాచారం 2030 నాటికి సమసిపోయేలా చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. చట్టబద్ధమైన వయస్సును 18 నుంచి 21కి మారుస్తూ కేంద్రం తీసుకొచ్చిన బాల్య వివాహాల నిషేధ (సవరణ) బిల్లు-2021 ఒక ఎత్తయితే, రాష్ట్రాల్లోని జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో బాల్య వివాహ నిరోధక కమిటీలున్నా, వాటికి సరైన అవగాహన కల్పించడం లేదు. ఇందుకు ఉదాహరణగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నివేదికను పేర్కొనవచ్చు. దేశవ్యాప్తంగా ప్రతి 50 మంది బాలికల్లో ఒకరు బాల్య వివాహానికి గురవుతున్నారు. కేరళ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాలలో బాల్య వివాహాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ, పశ్చిమబెంగాల్ 6.3, ఝార్ఖండ్ 4.6, ఒడిషా 2.6, రాజస్థాన్ 2.3, ఉత్తరప్రదేశ్ 1.7, ఉత్తరాఖండ్ 1.7 శాతం మేరకు బాల్య వివాహాలు జరిగాయి. మరో ఐదేళ్లలో 'బాల్య వివాహం' అనే పదం సమసిపోతుందని, ఈమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారిస్తుందని ఆశిద్దాం.

**- కోడం పవన్ కుమార్**
9848992825

# 'ప్రేమ'కు పట్టం కట్టిన వాలంటైన్





ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన వాలంటైన్స్ వారోత్సవాలు ప్రతి ఏట ఫిబ్రవరి 07 నుంచి 14 వరకు నిర్వహించడంతో పాటు చివరి రోజు 14 ఫిబ్రవరిన వాలంటైన్స్ దినం లేదా ప్రేమికుల దినంగా కూడా పెద్ద ఎత్తున పాటించడం నేటి డిజిటల్ యువతకు అలవాటుగా మారింది. ప్రేమ, ఆప్యాయతలే అమూల్య ఇంధనాలుగా ప్రపంచ మానవాళి శాంతి యుతంగా గడుపుతున్నది. శిశువుకు తొలి ప్రేమను పరిచయం చేస్తుంది అమ్మ. చిరునవ్వుల శిశువు నాన్న ఆప్యాయతను రుచి చూస్తుంది. అమ్మనాన్నలతో ప్రారంభమైన ప్రేమానురాగాలు, అనంత ఆప్యాయతలు క్రమంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వరకు విస్తరించి జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. ప్రేమ నిండిన హృదయాల్లో ద్వేషానికి తావు లేదు. ప్రేమానురాగాల రుచి చూడలేని అభాగ్యుల జీవితాలు గాఢాంధకారంలోనే ముగుస్తాయి. మానవ సంబంధాలతో మొదలైన ప్రేమలు చెట్లు, పువ్వులు, పెంపుడు జంతువులు, ఆట వస్తువులు, పుస్తకాలు లాంటి వాటి వరకు విస్తరించి వ్యక్తి జీవితంలో రంగుల సింగిడిలను రుచి చూపిస్తాయి. కౌమార దశలో అబ్బాయికి అమ్మాయిని చూసినా, అమ్మాయి అబ్బాయిని చూసినా ఏదో తెలియని వ్యతిరేక ధృవాల ఆకర్షణ ప్రేమ పేరుతో ప్రారంభమవుతుంది.

రోమన్ కాథలిక్ చర్చికి చెందిన సేయింట్ వాలంటైన్ చొరవతో యువ ప్రేమికులను ఏకం చేయడం, ప్రేమకు పట్టాభిషేకం చేయడాని తన ప్రాణాలను సహితం అర్పించడం జరిగింది. ఈ రోజున యువ జంట ఒకరినొకరు మనసు విప్పి తమ ప్రేమానురాగాలను, అప్యాయతలనుధైర్యంగా వ్యక్తం చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తారు. రోమన్ యువ సైనికులు పెళ్లిళ్లు చేసుకోవడాన్ని నిషేధించారు నాటి రోమన్ చక్రవర్తి క్లాడియస్-2. చక్రవర్తి విధించినా వివాహ నిషేధాజ్ఞలను బేఖాతరు చేస్తూ ప్రేమకు పట్టం కట్టడానికి పూనుకొన్న సేయింట్ వాలంటైన్ ఆ యువ జంటలను ఏకం చేస్తూ పెళ్లి పీటల వరకు తీసుకురావడం జరిగింది. తన నిషేధాజ్ఞలకు విరుద్ధంగా యువ సైనికులకు వివాహాలు చేసిన సేయింట్ వాలంటీన్కు క్రీ. శ. 14 ఫిబ్రవరి 269న మరణ శిక్ష విధించడంతో సేయింట్ వాలంటీన్ అమరత్వం పొందారు. తన ప్రాణాలకు తెగించి ప్రేమికులను ఏకం చేయడానికి కృషి చేసిన సేయింట్ వాలంటీన్ వర్ధంతి 14 ఫిబ్రవరి రోజున వాలంటీన్స్‌డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

సనాతన భారతంలో ప్రేమించుకున్న యువతీయువకులు రోడ్లు, పార్కులు, పబ్బుల్లో తమ ప్రేమలను వ్యక్తం చేసుకోకుండా ఒక పద్ధతిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహాలు నిశ్చయం చేసుకొని మంగళ సూత్రాల మూడు ముళ్లు పడిన అనంతరం మాత్రమే ఆలింగనాలు, ముద్దులు లాంటి శారీరక స్పర్శలకు అనుమతి ఇవ్వబడుతుంది. అయినప్పటికీ నేటి ఆధునిక డిజిటల్ భారతీయ యువత ప్రేమకు, కామానికి తేడా తెలియకుండానే క్షణాల్లో ప్రేమించుకోవడం, ఆలింగన ముద్దుల హద్దులు దాటడం, అన్ని రకాల శారీరక సుఖాలను అనుభవించడం, అటు పిమ్మట వాయు వేగంగా విడిపోవడం కూడా చూస్తున్నాం.

తల్లితండ్రులు కుదిర్చిన అరేంజ్డ్ మ్యారేజీలు కానీ ప్రేమ వివాహాలు కానీ ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే యువ ప్రేమికుల జంట వివాహ బంధంతో ఏకం కావాలని, తమ వైవాహిక జీవితాన్ని కడదాక ఆసాంతం ఆస్వాదించాలని, ఆదర్శ జంటగా ఆనంద హరివిల్లుల కుటుంబ జీవనం గడపాలని కోరుకుందాం. కామం కమ్మిన ఆకర్షణకు, అంతరంగిక ప్రేమామృత బంధాలకు మధ్య తేడాను అర్థం చేసుకొని సన్మార్గంలో తమ జీవితాలను కొనసాగించాలని మార్గనిర్దేశనం చేద్దాం. మూడుముళ్ల బంధాలు మామిడి తోరణాలు వాడిపోక ముందే విడిపోకుండా, విడాకులే కానరాని యువ భారతాన్ని కనులారా చూసి తరిద్దాం.

**(14 ఫిబ్రవరి వాలంటైన్స్ డే)**

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఏడు రంగుల ప్రేమ




ప్రతి ఏడాది ఫిబ్రవరి నెల రాగానే వాలెంటైన్ వారం గుర్తుకు వస్తుంది. ప్రేమకు చెందిన ఏడు భావాలను ప్రతిబింబించే ఈ వారం, ఒకప్పుడు మౌనంగా మిగిలిపోయిన హృదయాలను కూడా నెమ్మదిగా తాకుతుంది. ఈ రోజుల్లో ప్రేమ కేవలం బంధంగా కాక, జ్ఞాపకంగా, తపనగా, నిశ్శబ్ద ఆశగా మన హృదయాల్లో నిలుస్తోంది. కొందరికి ఇది ఆనందోత్సవం, మరికొందరికి చిరునవ్వుల వెనుక దాగిన నిశ్శబ్ద వేదన. ఒంటరిగా ఉన్నవారైనా, ఎవరో ఒకరిని హృదయంలో దాచుకుని జీవించే వారు కూడా ఉన్నారు. వాలెంటైన్ వారం ఫిబ్రవరి 7న రోజ్‌డేతో ప్రారంభమై, ఫిబ్రవరి 14న వాలెంటైన్ డేతో ముగుస్తుంది. ఈ ఏడు రోజుల ప్రయాణంలో ప్రతి రోజు ఒక ప్రత్యేక భావాన్ని జోడిస్తూ ముందుకు సాగుతుంది. దాంతో ప్రేమికుల హృదయాలు ఉత్సాహంతో, ఎదురుచూపులతో నిండిపోతాయి. ముఖ్యంగా యువతలో ఈ వారం ప్రత్యేకమైన ఉత్సాహాన్ని పెంచుతోంది. అయితే ఈ వేడుకలు ఇక యువజంటలకే పరిమితం కావడం లేదు. వివాహిత జంటలు కూడా వాలెంటైన్ వారాన్ని ఆనందంగా జరుపుకుంటూ, తమ కలిసిన క్షణాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ప్రేమను వ్యక్తపరుస్తూ భార్యాభర్తలతో తీసుకున్న ఫోటోలు, ప్రేమభరితమైన మాటలతో కలిసి సామాజిక మాధ్యమాల టైమ్‌లైన్‌లను ఏడు రోజులూ నింపుతున్నాయి. వాలెంటైన్ వారంలో తొలి రోజు అయిన రోజ్ డేకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. ఈ రోజున చెప్పలేని భావాలు మాటల రూపం దాలుస్తాయి. చేతిలో ఒక గులాబీ పువ్వు, హృదయంలో భావోద్వేగం-ఇవి మాటల కంటే ఎక్కువగా ప్రేమను వ్యక్తం చేస్తాయి. అందుకే పుష్పాల దుకాణాలు అన్ని రంగుల గులాబీలతో కళకళలాడుతుంటాయి. ప్రతి రంగు గులాబీ ఒక ప్రత్యేక భావాన్ని సూచిస్తుంది. వాటిలో ముఖ్యంగా రక్తవర్ణ ఎర్ర గులాబీలే ఎక్కువగా మనసులను ఆకట్టుకుంటున్నాయి.

ఈ ప్రతి రోజు ప్రేమకు ఒక కొత్త అర్థాన్ని జోడిస్తూ హృదయాలను మరింత దగ్గర చేస్తుంది. ఈ అన్ని భావాల సమ్మేళనమే చివరికి వాలెంటైన్‌డేలో ప్రేమగా రూపు దిద్దుకుంటుంది. వాలెంటైన్ వారం, ఏడు రోజుల్లో ప్రేమకు వేర్వేరు రూపాలను చూపుతూ, ప్రతి హృదయంలో ప్రేమను, ఆనందాన్ని, సన్నిహి తతను ఆలోచనలుగా నింపుతుంది.

**- డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ**


# మారుతున్న జీవనశైలి



మనిషి ఆరోగ్యంగా ఉండాలను కోవడంతప్పు కాదు. గౌరవంగా, సుఖసంతోషాలతో జీవించాలనుకోవడం కూడా దురాశ కాదు. ఇవన్నీ ప్రతి పౌరుడి సహజమైన ఆకాంక్షలే, ప్రాథమిక హక్కులే. కానీ ఈ లక్ష్యాలు నిజమవ్వాలంటే ముందుగా మన జీవనశైలిపై మనకే నియంత్రణ ఉండాలి. కానీ ఆరోగ్యం లేకపోతే ఆ విజయం కూడా భారమే. శరీరం, మనస్సు రెండూ సమతుల్యంలో ఉన్న ప్పుడే మనిషి నిజమైన ఆనందాన్ని అనుభవించగల డు. అందుకే చిత్తశుద్ధి, సంకల్పబలం, క్రమశిక్షణతో కూడిన మంచి జీవనశైలిని ఆలంబిస్తే ఆరోగ్యం, సంపద, సంతోషం మన వెంటనే నడుస్తాయి.ఏ మంచి కార్యమైనా, ఏ అద్భుతమైన విజయమైనా రాత్రికి రాత్రే సాధ్యం కాదు. ఓర్పు, స్థిరత్వం, నిరంతర ప్రయత్నం అవసరం. అలాంటి జీవన విధానమే మనిషిని అంతిమ విజేతగా నిలబెడుతుంది. అదే పరిపూర్ణ జీవితానికి బాటలు వేస్తుంది.

నేటి మనిషి జీవనశైలిలో ఆరోగ్య అలవాట్ల కంటే అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లే ఎక్కువయ్యాయి. ఫాస్ట్ ఫుడ్, అధిక కొవ్వులు, చక్కెరతో నిండిన ఆహారం, సమయానికి భోజనం చేయకపోవడం వంటి అలవాట్లు మన శరీరాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, కాలేయ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి.

దేశవ్యాప్తంగా 45 ఏళ్లలోపు వ్యక్తుల మరణాలకు సుమారు 42 శాతం మేర జీవనశైలి లోపాలే కారణమని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ అధ్యయనం చెబుతోంది. ధూమపానం, మద్యం సేవనం ప్రధాన రిస్క్ ఫ్యాక్టర్లుగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.



ఐటీ రంగంలో పనిచేసే యువత రోజుకు 10 నుంచి 12 గంటలు కంప్యూటర్ల ముందు కూర్చునే పరిస్థితి. దీని వల్ల వెన్నుముక సమస్యలు, మెడ నొప్పులు, కండరాల బలహీనత పెరుగుతున్నాయి. మరో వైపు ఫ్యాట్ లివర్ లాంటి సమస్యలు 'నిశ్శబ్ద హంతకుల్లా' వ్యాపిస్తున్నాయి. మన జీవనశైలి మారకపోతే మన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

వ్యసనాల బారిన పడి ఎవరైనా మరణిస్తే, అది ఆ వ్యక్తి ఒక్కరి నష్టం కాదు. అతని కుటుంబానికి చేసిన ఘోరమైన నమ్మక ద్రోహం పెద్దలు చెప్పినట్లే-ఆరోగ్యం చేజారితే కీర్తి, ధనం, గౌరవం ఏదీ మనిషికి ఆనందాన్ని ఇవ్వదు. ఈ ఆధునిక ప్రపంచంలో ఏ కార్యం సాధించాలన్నా ముందుగా కావలసింది ఆరోగ్యం.

నిజంగా ఆరోగ్యంగా ఉన్నవాడే అసలైన ధనవంతుడు.ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. ప్రతి జీవితానికి ఓ అర్థం, ఓ ప్రయోజనం ఉంటుంది. జీవితంలో అన్నీ కోల్పోయినా ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది-భవిష్యత్తు. దానిని తీర్చి దిద్దు కోవడం మన చేతుల్లోనే ఉంది. మంచి ఆహారం, క్రమమైన వ్యాయామం, తగిన నిద్ర, సానుకూల ఆలోచనలు, కుటుంబంతో గడిపే నాణ్యమైన సమయం-ఇవన్నీ మంచి జీవన శైలిలో భాగాలు. అలాగే టైం మేనేజ్‌మెంట్ కంటే ముఖ్యమైనది సెల్ఫ్ మేనేజ్‌మెంట్.

మనల్ని మనం నియంత్రించుకున్నప్పుడే కాలాన్ని సద్వినియోగం చేసుకోగలం. ప్రతి ఒక్కరూ 'టైం బిలియనీర్లే'. కానీ ఆ కాలాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యం. ఆరోగ్యం, వికాసం, ఆర్థిక విజయం కోసం కాలాన్ని సరైన దిశలో పెట్టుబడి పెట్టినప్పుడే జీవితం అర్థవంతమవుతుంది.

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి, కానీ ఈ క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. సుఖదుఃఖాల మేళవింపే జీవితం అని గ్రహించాలి. నేటి ఆధునిక జీవన కురుక్షేత్రంలో పోరాటం ఆయుధాలతో కాదు?. దురలవాట్లు,మానసిక అస్థిరత, సంపాదనే అంతిమ ధ్యేయంగా వ్యక్తిగత జీవితంలో-సామాజిక వ్యవస్థలోనూ పోరాడుతూ దారి తప్పు తున్నాడు. వాటి వ్యామోహంలో చిక్కుకొని విలువైన జీవితాన్ని కోల్పో తున్నాడు. సమయం,ఆరోగ్యం,బంధాలు-వీటికి ధర లేదు. ప్రాప్తాకానీ ఇవి కోల్పోయినప్పుడే వాటి 'విలువ' తెలుస్తుంది.అందుకే ఈ క్షణం నుంచే సమయాన్ని సద్వినియోగించుకోవాలి.

'ఆరోగ్యాన్ని' కాపాడు కోవాలి,బంధాల్ని నిలబెట్టుకోవాలి.ఈ గొలుసు కట్టుతోనే మనిషి జీవితానికి సార్థకత వస్తుంది. ఈ మూడింటిని కలిపే శక్తి ఒక్కటే.. మంచి జీవనశైలి.అదే మనిషికి నిజమైన సంపద.అదే మనిషికి నిజమైన గౌరవం. అదే మనిషికి అంతిమ విజయం.

**- మేకిరి దామోదర్**
9573666650

### ప్రేమద్విపదలు

మనసుతోటన చెలి
మల్లెల తీరు
తాపపు తీగలు
తనువుపై పారు
విరితోట వలపుల
విరహపు బాట
సిరివెన్నెల కురిసె
జిగెలుగా తోట
మనసు వికలమైన
మల్లెలమరపు
తనువులోలోపల
తాపపు తలపు
శిలలుకరిగితేను
చిత్రమే మనకు

శిలలు తలనువంచు
శిల్పి చేతలకు
ప్రియుడు శిల్పిమరియు
ప్రియురాలు శిలయె
ప్రియ కరిగెను ఉలి
ప్రేమకు సరియె

**- రేడియమ్**
9291527757

# అసెంబ్లీలో మార్మోగిన మహాదానకర్ణుడి పేరు

- కొవ్వూరి బసివిరెడ్డి గౌరవార్థం ఎమ్మెల్యే నల్లమిల్లి విజ్ఞప్తి

కాకినాడ, ఫిబ్రవరి మనం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. సామాజిక సేవతో చరిత్రలో నిలిచిన మహానుభావుడు స్వర్గీయ కొవ్వూరి బసివిరెడ్డి గారి సేవలను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి సభ ముందు విపులంగా వివరించారు. సోషల్ మీడియా లేదా స్థానిక వేదికలకే పరిమితం కాకుండా, రాష్ట్ర శాసనసభ వేదికగా ఆయన మహాత్మ్యాన్ని చాటడం ద్వారా ఆ మహనీయునికి ప్రత్యేక గౌరవం దక్కింది.

**జననం – అభ్యుదయం – సేవా దృక్పథం**

గొల్లల మామిడాడలో సామాన్య కుటుంబంలో జన్మించిన బసివిరెడ్డి గారు కృషి, వ్యాపార దూరదృష్టితో దేశ విదేశాల్లో పత్తి, ధాన్యం ఎగుమతులు చేసి వేల ఎకరాల ఆస్తి సంపాదించారు. అయితే ఆ సంపదను వ్యక్తిగత అధికారం గా కాకుండా సామాజిక భరోసాగా మార్చాలనే సంకల్పంతో ఉభయగోదావరి జిల్లాల్లో సుమారు నాలుగు వేల ఎకరాలను 42 కాలనీలుగా అభివృద్ధి చేసి బసివిరెడ్డి పేట పేరుతో ప్రజలకు అందించారు.

**అన్నదానం – సత్రాలు – విక్టోరియా ప్రశంస**

ఆకలితో బాధపడుతున్న ప్రజల కోసం అనేక సత్రాలు నిర్మించారు. సామర్లకోట రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బసివిరెడ్డి సత్రం ఇప్పటికీ ఆయన సేవలకు నిదర్శనం. హౌరా-సామర్లకోట మార్గంలో రైలు గంటసేపు ఆగే సమయంలో ప్రయాణికులకు ఉచిత భోజనం ఏర్పాటు చేసిన సేవను గుర్తించి బ్రిటిష్ కాలంలో విక్టోరియా మహారాణి 1895 సెప్టెంబర్ 7న మహా అన్నదాత బిరుదుతో ప్రశంసాపత్రం అందించారు.

**ప్రజా ఉపయోగాలు – సాంస్కృతిక సేవలు**

ఆ కాలంలోనే అనేక బావులు తవ్వించి, చెరువులు నిర్మించి నీటి సమస్యలను పరిష్కరించారు. 1911లో ఆంధ్ర ప్రచారిణి గ్రంథాలయం స్థాపించి కవులకు ఆశ్రయం కల్పించి వారి రచనలను ప్రచురింపజేశారు. 1902లో గొల్లల మామిడాడలో నిర్మించిన సూర్యదేవాలయం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు అందుకుంటున్న దక్షిణ భారతదేశంలో అరుదైన ఆలయంగా నిలిచింది.

**ప్రభుత్వ గుర్తింపు కోరిన ఎమ్మెల్యే**



బసివిరెడ్డి స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలని ఉభయగోదావరి జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయన పేరు పెట్టాలనిజన్మదినాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని అసెంబ్లీ ద్వారా కోరారు. సభలో స్పందన సభాపతి స్థానంలో ఉన్న రఘురామ కృష్ణంరాజు గొల్లల మామిడాడ ఏ నియోజకవర్గంలో ఉందని అడగగా, అనపర్తి పరిధిలోనే ఉందని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. ప్రతిపాదన సమంజసమని పేర్కొంటూ సంబంధిత మంత్రికి ఇవ్వాలని, తాము సిఫారసు చేస్తామని సభాపతి తెలిపారు.

# ఎస్టీయూ ఆధ్వర్యంలో దద్దరిల్లిన కలెక్టరేట్ వద్ద ధర్నా




మార్కాపురం,ఫిబ్రవరి 13 మనం న్యూస్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల కు తన మేనిఫెస్టో ప్రకటించిన హామీలు తక్షణమే అమలు పరిచే విధంగా రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం లో భాగంగా మార్కాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ మార్కాపురం జిల్లా అధ్యక్షులు టి కె యస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమం నకు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంగళరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమము లో ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ గాలయ్య మరియు భారీ సంఖ్య లో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు వివిధ మండలాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ధర్నా కార్యక్రమం లో పాల్గొన్నారు.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంగళ రెడ్డి మాట్లాడుతూ నాలుగు పెండింగ్ డి ఏలను ప్రకటించాలి. మెమో. 57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలి.అనీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రయ్య మాట్లాడుతూ సిపిఎస్ జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు టి కె యస్ ప్రసాద్ మాట్లాడుతూ పిఆర్సి కమిషన్ ను నియమించి 30% మధ్యంతర భృతి ప్రకటించాలి. దీర్ఘకాలిక ఆర్థిక బకాయిల చెల్లింపులకు రోడ్ మ్యాప్ ప్రకటించి వెంటనే బకాయిలను ఉద్యోగులకు చెల్లించాలి అనీ డిమాండ్ చేశారు.ప్రధాన కార్యదర్శి దేశా నాయక్ మాట్లాడుతూ పెన్షన్ సౌలభ్యాలు పదవీ విరమణ చేసిన మరుసటి రోజు ఉద్యోగికి అందించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమం అనంతరం ఖిల్జీ నాయకులు ర్యాలీ గారు జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు కు వినతి పత్రం అందచేశారు. సిపిఐ నాయకులు అందె నాసరయ్య, కాసిం మద్దతు తెలిపినారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డివిజన్ నుండి నరసింహారెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, శ్రీలత, రాజా మరియు వారి కార్యవర్గ సభ్యులు అలాగే గిద్దలూరు డివిజన్ నుండి రాఘవరెడ్డి, చెంచయ్య, సూరాని వెంకటేశ్వర్లు, బివి నారాయణ, శివప్రసాద్, జడ్ సి రంగయ్య, రాంప్రసాద్, రంగస్వామి, గురవయ్య, ఎస్ వి ప్రసాద్, జాన్సన్, శివశంకర్, రవిచంద్ర రెడ్డి, రహమత్ భాష, మహమ్మద్ భాష, కృపానందం, మేరీ కార్లియన్, సోఫియా రాణి, జయశ్రీ, ఉషారాణి, అరుణ కుమారి, పద్మావతి, అనురాధ, రత్నావళి, కాసిం వలి, వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటేశ్వర్లు, ఇబ్రహీం మరియు వారి కార్యవర్గ సభ్యులు అలాగే మార్కాపురం డివిజన్ నుండి అక్కల నారాయణ, వెంకటరమణ, గురవయ్య, యూసఫ్ షరీఫ్, రాందాసు మరియు వారి కార్యవర్గ సభ్యులు పాల్గొని ధర్నా కార్యక్రమం విజయవంతం చేయడం జరిగినది.





# మహాశివరాత్రికి పొదిలిలో 'గిరి' ప్రదక్షిణ

- నూతనసేవకు శ్రీకారం చుట్టిన ఆలయచైర్మన్

పొదిలి, ఫిబ్రవరి 13 మనం న్యూస్: మార్కాపురం జిల్లా పొదిలి దక్షిణకాశిగా పివవబడుతున్న శ్రీ పార్వతీ సమేత నిర్మమహేశ్వర ఈ శివరాత్రి పర్వదినం సందర్బంగా అరుణచలంలో వలె పొదిలిలో గిరి ప్రదక్షిణ ఆదివారం అర్ధరాత్రి 12 తరువాత... ప్రారంభించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య తెలిపారు.సాంప్రాదాయ దుస్తులతో ఆదివారం రాత్రి లింగొద్భవ మహహరతీ అనంతరం గిరి ప్రదక్షణ ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.శివాలయం నుంచి ప్రారంభమై చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్ ,రథంరోడ్ నుంచి ఆలయం వరకు ఒక ప్రదిక్షణ అలా మూడుసార్లు ప్రదిక్షణ చేయాలని సంకల్పంచినట్లుగా తెలిపారు. ఇలా ప్రదక్షణ చేయడంవల్ల స్వామివారికృపకు పాత్రులై అభీష్టసిద్ది కలుగుతుందని చెప్పారు. పరమశివుని భక్తులందరు సాంప్రాదాయ వస్త్రదారణతో ఈ కార్యక్రమంలో పాల్గోని విజయవంతం చేయాలని ఆయన కొరారు.

# ఒమేగా హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ డ్రైవ్



మార్కాపురం, ఫిబ్రవరి 13 మనం న్యూస్: డా . శామ్యూల్ జార్జ్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ , మార్కాపూర్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడింది. ఈ డ్రైవ్ను ప్రముఖ సంస్థ ఒమేగా హెల్త్ కేర్ (హైదరాబాద్ ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్లో మొత్తం 136 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 32 మంది విద్యార్థులు మెడికల్ కోడింగ్ విభాగంలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఆనందకర వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. డి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మన విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల మరియు నైపుణ్యాలతో ముందుకు సాగుతున్నారని ఈ ఎంపికలు స్పష్టం చేస్తున్నాయి. సంస్థ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, ప్రాక్టికల్ అవగాహన విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి అవకాశాలను కళాశాల కల్పించడానికి కృషి చేస్తుంది అని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తయారవ్వడం చాలా ముఖ్యమని, కళాశాల ఎల్లప్పుడూ పరిశ్రమలతో అనుసంధానం పెంచుకుంటూ విద్యార్థులకు ఉత్తమ అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఫ్యాకల్టీ మరియు ప్లేస్మెంట్ విభాగాన్ని అభినందించారు. ఈ డ్రైవ్లో డీన్ ఆఫ్ అకడమిక్స్ డా. వై. సునీత , సీఈవో డా. కె. అశోక్ బాబు , ఎక్యూఎసీ ఇన్చార్జ్ సయ్యద్ ముజీబ్ , డా. అనుష , ప్లేస్మెంట్ ఆఫీసర్ కె. ప్రశాంత్ పాల్గొన్నారు.



# మినీ జాబ్ మేళాకు అపూర్వ స్పందన

(మార్కాపురం ఫిబ్రవరి 13 మనం న్యూస్): మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్మెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నిరుద్యోగుల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 400 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. క్రెడిట్ కార్డ్, డీమార్ట్ తదితర సంస్థలు స్టాళ్లు ఏర్పాటు చేసి అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి దరఖాస్తులు స్వీకరించాయి. భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

# పదో తరగతిలో ప్రథమ ఉత్తీర్ణతకు పదివేలు బహుమతి

శంఖవరం మనం ప్రతినిధి ఫిబ్రవరి 13: ఉన్నతమైన విద్య కొరకు పోటీ తత్వం కలిగి అభ్యసించాలని విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడు, జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులను ఆకాంక్షించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మంచి బహుమతుల అవకాశం. శంఖవరం మండల పరిధిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు 2026 వార్షిక పరీక్షల్లో శంఖవరం మండల స్థాయిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీ సాయి సత్య దేవా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేయ నున్నది. ఈ మేరకు పాత్రికేయుడు, అసోసియేషన్ నిర్వాహకుడు, విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షల్లో మండల స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. 10,000, ద్వితీయ బహుమతిగా రూ. 7,500, తృతీయ బహుమతిగా 5,000 లు చొప్పున నగదును జనసేన పార్టీ కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ద్వారా పంపిణీ చేసి, ఘనంగా సత్కరిస్తామని నాగేశ్వరరావు తెలిపారు. కేవలం విద్యార్థి ప్రతిభామూర్తులనే కాకుండా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను, విద్యార్థులను తీర్చిదిద్దిన తల్లి



దండ్రులను కూడా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ద్వారా సత్కరిస్తామని కొంతంగి జనసేన పార్టీ అధ్యక్షుడు, శ్రీ సాయి సత్య దేవా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- పొత్తూరి రామరాజు

నరసాపురం, ఫిబ్రవరి 13 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని దీనిలో భాగంగానే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం స్థానిక నియోజక వర్గ తెదేపా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు.
నియోజక వర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్, రహదారులు, తాగునీరు తదితర అంశాల పై వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటా మని పొత్తూరి రామరాజు



హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేం దుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రతి వారం ఈ వేదిక ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పార్టీ సీనియర్ నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, వాతాడి ఉమామహేశ్వరరావు, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, తువ్వులపల్లి లక్ష్మీనారాయణ, పట్నాల జగన్, బాలం ప్రతాప్, తిరుమలశెట్టి నాగేశ్వరావు, నాగిడి రాంబాబు, బోరా చిన్నాయమ్మ, పడవల సత్య నారాయణ, జట్ల నాగేశ్వరావు, చీకట్ల కనకదుర్గ, జక్కం కాశీ, బుంగ రమేష్ కుమార్, అలివేలు మంగతాయారు, శృంగారకవి శ్రీనివాస్, దేశెట్టి సత్యనారాయణ, బొమ్మిడి అర్జునరావు, ఉద్దగిరి అచ్యుతరామయ్య, నందా రామ కృష్ణ, బస్వాని నాగమణి, మోకా ఏడుకొండలు, నాట్ర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శంఖవరంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ముద్రగడ



- మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం

శంఖవరం ఫిబ్రవరి 13 మనం ప్రతినిధి: ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రమైన శంఖవరం గ్రామంలో పర్యటించిన ముద్రగడ గిరిబాబు పర్యటించారు. శంఖవరం గ్రామం లోని అంబేద్కర్ కాలనీకి చెందిన వైస్సార్సీపీ కార్యకర్త కానేటి అప్పన్నబాబు (సల్మాన్ రాజు) సోదరుడు కానేటి ఎతిమని ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఎతిమని కుటుంబాన్ని పరామర్శించి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. మృతుడి కుటుంబ సభ్యులకు వైస్సార్సీపీ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు ఆచంట వెంకటేశ్వరరావు, పోలిమాటి శాంతి భరత్, బోడపాటి మణియ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు వినియోగించుకున్న బండారు

నరసాపురం, ఫిబ్రవరి 13 (మనం న్యూస్): రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం నరసాపురం కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం న్యాయవాదులతో కలిసి పలు అంశాలపై చర్చించారు.



# శివ స్వాములకుతూర్పు వీధి మహిళ బృందం సేవా కార్యక్రమం

మార్కాపురం, ఫిబ్రవరి 13 మనం న్యూస్: శ్రీశైలం చింతల గ్రామంలో రాములవారి దేవస్థానం దగ్గర గత 15 సంవత్సరాలనుంచి శివరాత్రి టైంలో 7 రోజులు శివ భక్తులకి శివ స్వాములకు యాత్రికులకు వెన్న శ్రీధర్ రెడ్డి వారి బృందం ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం సాయంత్రం టిఫిన్ ఏర్పాటు చేస్తున్నారు దీనిలో భాగంగా తూర్పు వీధి మహిళ బృందం గత వారం నుంచి మార్కాపూర్ నుంచి చింతలకు వెళ్లి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు వారికి వేన్నా శ్రీధర్ రెడ్డి బృందం ధన్యవాదాలు తెలియజేసుకున్నారు.

# మున్సిపల్ శాఖ డైరీని ఆవిష్కరించిన మార్కాపురం మున్సిపల్ కమిషనర్

మార్కాపురం, ఫిబ్రవరి 13 మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యొక్క డైరీ కమ్ హ్యాండ్ బుక్ ను మార్కాపురం పురపాలక సంఘ కమీషనర్ డివిఎస్ నారాయణరావు చే ఆవిష్కరించడమైనది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నో ఏళ్లుగా మున్సిపల్ ఉద్యోగులకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నదని మరియు అదేవిధంగా రానున్న రోజుల్లో కూడా ఈ యూనియన్ ప్రతి ఒక్క మున్సిపల్ ఉద్యోగికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఒక యూనియన్ గా మేమున్నాం అంటూ ఒక హామీని కల్పించినది అని అలాగే అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. కృష్ణ మోహన రావుకి మరియు కార్యవర్గ సభ్యులు అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యొక్క ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు మార్కాపురం మునిసిపల్ మేనేజర్ యు ఆంజనేయులు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మరియు మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ షేక్ టపా ఖాదర్ వలి , మార్కాపురం పురపాలక సంఘ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపాల్ రెడ్డి రెవిన్యూ అధికారి షేక్ సోహిల్ అహ్మద్ , ఎఖిగి మేనేజర్ శేఖర్ బాబు , టౌన్



ప్లానింగ్ అధికారి కె శ్రీనివాసులు , శానిటరి ఇన్స్పెక్టర్ బి చెన్నకేశవులు, పురపాలక సంఘ సీనియర్ సహాయకులు శ్యామ్ , విజయకుమార్ పద్మావతి ,వంశీ , జూనియర్ సహాయకులు తల్లమ్ ప్రసాద్ ,తాడి సత్యనారాయణ , గుమ్మా ప్రసాద్, పి వెంకటయ్య, కిరణ్ , చప్పిడి శ్రీనివాసులు వినయ్ కార్యాలయ సిబ్బంది, అందరూకంప్యూటర్ ఆపరేటర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొనుట జరిగినది.

# రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఏర్పాట్లకు ఆదేశాలు ఇవ్వండి



విజయవాడ,మనం న్యూస్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి నస్యం మహమ్మద్ ఫరూఖ్ కు లేఖ రాశారు. 2026 ఫిబ్రవరి 18 లేదా 19 తేదీలలో (చంద్రమాస దర్శనం ఆధారంగా) పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమయ్యే నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మసీదుల్లో భారీగా ఐదు పూటల ప్రార్థనలు, ప్రత్యేక తరావీహ్ నమాజులు నిర్వహించబడనున్నాయని తెలిపారు. సహరి, ఇఫ్తార్ వేళల్లో ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. మసీదులలో తాగునీరు, పారిశుద్ధ్యం, శుభ్రత, భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో ఎటువంటి లోపం లేకుండా మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాత్రి వేళల్లో మార్కెట్లు, కూరగాయల దుకాణాలు, హోటళ్ల కు ప్రత్యేక అనుమతులు మంజూరు చేసేలా పోలీస్ శాఖ కు మార్గదర్శకాలు ఇవ్వాలని అన్నారు. మసీదుల వద్ద సదుపాయాల కోసం రాష్ట్రంలోని వక్ఫ్ సంస్థల నిర్వాహకులకు, అన్ని జిల్లాల ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్ కు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ జిల్లాల యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో సైబర్ దందా విరుచుకుపాటు

- ఏడాదిలో 975 కేసులు, రూ.5.19 కోట్ల మోసం

అమలాపురం, ఫిబ్రవరి 13(మనంన్యూస్): అమలాపురం కలెక్టరేట్ పరిధిలో సైబర్ నేరాలు ఆందోళనకర స్థాయికి చేరాయి. అధిక లాభాలు, తక్కువ ధరలు, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు వంటి పద్ధతులతో సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో వేసుకుంటున్నారు. గత ఏడాది కాలంలో జిల్లాలో మొత్తం 975 మంది బాధితులు మోసపోయి రూ.5.19 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు పోలీసులు వెల్లడించారు.

**మోసాల ప్రధాన పద్ధతులు...**

సైబర్ నేరాల్లో ఎక్కువగా పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించే స్కామ్లు చోటుచేసుకుంటున్నాయి. ప్రారంభంలో బాధితుల ఖాతాల్లో లాభాలు వచ్చినట్లు చూపించి నమ్మకం కల్పిస్తారు. కానీ నగదు విత్డ్రా చేసుకునే అవకాశం మాత్రం ఇవ్వరు. ఈకేవైసీ లేదా సాంకేతిక కారణాలు చెప్పి చివరకు మరిన్ని డబ్బులు వేయమని ఒత్తిడి తెస్తారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులమని చెప్పి వీడియో కాల్స్ చేసి భయపెట్టి కోట్ల రూపాయలు దోచుకున్న ఘటనలు కూడా నమోదయ్యాయి.

**తక్కువ ధరల మాయ..**

ఆన్లైన్లో తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని ప్రకటనలు పెట్టి డబ్బులు వసూలు చేసే కేసులు పెరుగుతున్నాయి. అమలాపురానికి చెందిన ఒక వ్యక్తి మొబైల్ ఫోన్ కొనుగోలు చేయగా సరుకు రాకపోవడంతో కాల్ చేయగా డబ్బులు తిరిగి ఇస్తామని ఓటీపీ చెప్పించి రూ.1.02 లక్షలు దోచుకున్నారు.

**లింక్ క్లిక్ – లక్షల నష్టం**

ఒక బాధితుడికి అనుమానాస్పద లింక్ రావడంతో క్లిక్ చేసిన వెంటనే ఖాతా నుండి రూ.64 లక్షలు మాయం అయ్యాయి. పోలీసులు వెంటనే స్పందించి రూ.11.80 లక్షలు మాత్రమే హోల్ చేయగలిగారు. వెంటనే స్పందించాలి సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్లైన్కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు. మొదటి గంటలో ఫిర్యాదు చేస్తే బ్యాంక్ ఖాతాలను నిలిపివేసి డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ప్రజలకు హెచ్చరిక

**డిజిటల్ అరెస్ట్ అంటూ ఎవరు ఫోన్ చేసినా నమ్మకండి**

ఓటీపీ ఎవరితోనూ తెలియని లింక్లు ఓపెన్ చేయొద్దు పెట్టుబడి యాప్లలో అధిక లాభాల ఆశకు లోనుకావద్దు జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు

# వైఎస్ షర్మిల ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమం

**(మార్కాపురం ఫిబ్రవరి 13 మనం న్యూస్):** మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలం తుమ్మలచెరువు లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ జిల్లా నేత షేక్ సైదా మరియు జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు.ఈ సందర్భంగా రచ్చబండ కార్యక్రమం ఆమె మాట్లాడుతూ వీబీ జీ-ఆర్ఎఎం జీ చట్టం ద్వారా జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు.ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు 100 రోజుల పని దినాలు కల్పించడం లో ప్రస్తుత ప్రభుత్వం విఫలం అయిందని దుయ్యబట్టారు.మోడీ సర్కారు పేరు మార్పునకు చూపించే చొరవ పేదలకు పని కల్పించడం మీద లేదు అని అన్నారు. అర్హత కలిగిన పేదలకు జాబ్ కార్డులు ను అకారణంగా తొలగిస్తున్నాయి అని అన్నారు. ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టి 20 ఏళ్లు అవుతుంది ,ఆనాడు ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉండగా రాష్ట్రంలోనే ఈ పథకం ప్రారంభం అయింది ,ఆనాడు ఉపాధి హామీ పని అంటే అద్భుతంఅని పేదలకు 100 రోజుల పాటు కచ్చితమైన పని కల్పన ఉండేదని,గ్రామీణ పేద కుటుంబాలకు కరువు పని బరోసా అయింది అని వైఎస్ఆర్ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేశారు.ప్రపంచానికి కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన పథకం ఆదర్శం అయిందని ఆనాడు అమెరికా , లండన్ నుంచి వచ్చి పథకం తీరు తెన్నులను పరిశీలించి రిపోర్ట్ లు రాశారు,కోట్ల మంది ఉపాధి కల్పించిన పథకం



మరొకటి లేదు అని పేదల పొట్ట నింపిన కరువు పనిపై మోదీ కుట్రలు చేశారు అని పథకాన్ని నీరు గార్చి, ఎత్తివేయాలని చూస్తున్నారని కేంద్రంలో మోదీ అధికారంలో వచ్చాక ఉపాధి హామీ పథకానికి గ్రహణం పట్టింది అని ప్రతి ఏడాది జాబ్ కార్డులను తొలగిస్తున్నారు గత ఏడాది మన రాష్ట్రంలో 18 లక్షల కార్డులు తొలగించారు అని ఇది పేద కుటుంబాలకు చేసిన అన్యాయం కాదా ? అని ప్రశ్నించారు ,100 రోజుల పని పథకాన్ని దయనీయంగా మార్చారు,100 రోజుల పని ఇవ్వాల్సిన చోట సగటున 50 రోజులు కూడా ఇవ్వడం లేదు.ఇప్పుడు పూర్తిగా ఎత్తివేసి కొత్త పథకాన్ని తెచ్చారు అని అన్నారు . గాంధీ పేరు తొలగించి వీబీ జీ-ఆర్ఎఎం జీచట్టాన్ని తెచ్చారు కాంగ్రెస్ అమలు చేసిన మన్రేగా పథకానికి , మోదీ తెచ్చిన గ్రామ్ జి పథకానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది .గ్రామ్ జి చట్టంలో గ్రామసభల నిర్ణయాన్ని తొలగించారు,గ్రామ్ జి చట్టాన్ని కాంట్రాక్టర్ల చేతిలో పెట్టారు .ఉపాధి హామీ శ్రామికులు ఇకపై కాంట్రాక్టర్లకు లేబర్ లెక్క పని చేయాలి . కాంట్రాక్టర్లకు అవసరం అయిన పనులు మాత్రమే చేయాలి , మొత్తం చట్టం లో 125 రోజుల పని అని పెట్టారు ,125 రోజులు పని ఇవ్వడం అనేది పెద్ద జోక్ అని అన్నారు.సగటున 50 రోజులు పని ఇవ్వని వాళ్ళు 125 రోజులు ఇస్తాం అంటే నమ్మాలా ? మన్రేగా కింద మొత్తం ఖర్చు కేంద్రానిదే కేంద్రమే 100 శాతం నిధులు ఇవ్వాలి ,ఇపుడు కొత్త చట్టం లో రాష్ట్రాలకు భాగస్వామ్యం చేశారు, రాష్ట్రాల నెత్తిన 40 శాతం నిధులు ఇవ్వాలని నిబంధన పెట్టారు ఇది మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెనుభారం ఏడాదికి 5 వేల కోట్ల భారం పడుతుంది . రాష్ట్రాలు 40 శాతం నిధులు ఇవ్వకపోతే కేంద్రం కూడా 60 శాతం నిధులు విడుదల చేయదు . మొత్తంగా పథకాన్ని ఆపేయొచ్చు. ఇదే కేంద్రం అమలు చేసే కుట్ర . 12 గంటల పని నిబంధన పెట్టడం అత్యంత దారుణం రాష్ట్రానికి హాని చేసే మోడీ చట్టానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దారుణం . మద్దతు ఇవ్వడం ఎందుకు ? మళ్లీ ఢిల్లీ వెళ్లి నిధులు మీరే ఇవ్వండి అని అడగడం ఎందుకు ? మోడీ దగ్గర ప్రశ్నించే దమ్ము రాష్ట్రంలో ఎవరికి లేదు ,ప్రశ్నించాల్సిన జగన్ సైతం మోదీ కి వంగి వంగి దండాలు పెడుతున్నారు,ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరణ కోసం వైసీపీ ఒక్క ఉద్యమం చేయలేదు ,ఖిఖ ఆశయాల నుంచి పుట్టిన పథకం అని కూడా జగన్ కి తెలియడం లేదు ,రాష్ట్రాలలో బాబు జగన్ పవన్ ముగ్గురు బీజేపీ కి బానిసలే ,రాష్ట్ర అభివృద్ధికి ముగ్గురు అడ్డు పడుతున్న వాళ్లే ప్రజల కోసం ఇచ్చిన ఒక్క వాగ్దానం నిలబెట్టుకుంది లేదు ,హామీలు ఇవ్వడం, మరిచిపోవడం బాబు కి , జగన్ కి అలవాటు గా మారింది.బిడ్డలకు ఉద్యోగాలు లేవు . రాష్ట్రానికి రాజధాని లేదు జాబ్ క్యాలెండర్ లు అని ఇద్దరు ముఖ్యమంత్రిలు మోసం చేసిన వాళ్ళే ఇద్దరు చేస్తున్నవి స్వార్థ రాజకీయాలు మాత్రమే రాష్ట్రంలో అసలైన ప్రతిపక్షం కాంగ్రెస్ మాత్రమే కాంగ్రెస్ మాత్రమే ప్రజల పక్షం కాంగ్రెస్ కి ఎవరికో గులాంగిరి చేయాల్సిన అవసరం లేదు.రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలో రావాలి .కాంగ్రెస్ తోనే అప్పటి ,ఖిఖ పాలన సాధ్యం .ఉపాధి హామీ చట్టం కోసం ప్రజల మద్దతు కావాలి. గ్రామాలు బాగుపడాలి అంటే ఉపాధి హామీ చట్టం బ్రతకాలి అని మహాత్మా గాంధీ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని, కాంగ్రెస్ చేపట్టిన పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నేత షేక్ సైదా మరియు జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు పాల్గన్నారు

## పాలకొల్లు కళాపరిషత్ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**పాలకొల్లు, ఫిబ్రవరి 13,మనం ప్రతినిధిః** మార్చి 13,14, 15 తేదీల్లో పాలకొల్లులో నిర్వహిస్తున్న పాలకొల్లు కళాపరిషత్ 17వ జాతీయస్థాయి నాటిక పోటీల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణ వర్మ అధ్యక్షతన జరిగింది. ఆహ్వాన పత్రికను పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షులు కెవి కృష్ణ వర్మ ఆవిష్కరించి పత్రిక తొలి కాపీని సంస్థ గౌరవాధ్యక్షులు మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, ఉపాధ్యక్షులు డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ కు అందజేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణ వర్మ మాట్లాడుతూ సాంఘిక నాటక రంగానికి పుట్టినిల్లు అయిన పాలకొల్లులో నాటక రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత 75 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహించబడుతున్నాయని అదే స్ఫూర్తితో పాలకొల్లు కళాపరిషత్ గత 17 ఏళ్లుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు దాతలు సహాయ సహకారంతో నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ గౌరవాధ్యక్షులు మేడికొండ శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ బస్టాండ్ సెంటర్లో అడబాల థియేటర్స్ వెనుక ఖాళీ స్థలంలో వేదిక ఏర్పాటు చేసి నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షులు డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ మాట్లాడుతూ ఈనాటిక పోటీల్లో మూడు రోజులు పాటు ఎనిమిది నాటికలు ప్రదర్శింపబడతాయని ప్రేక్షకులు నాటిక పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, షేక్ పీర్ సాహెబ్, నడపన శ్రీనివాసరావు, కొల్లి కొండ ప్రసాద్, రెడ్డి వాసు, జి ఎస్ ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబైన శివదేవ స్వామి దేవస్థానం



**పాలకొల్లు, ఫిబ్రవరి 13,మనం ప్రతినిధిః** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శివదేవ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 15వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉత్సవాలు ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహించుకునేందుకు ఏర్పాటు పూర్తయ్యాయి. ఆంజనేయస్వామి స్వయంగా ప్రతిష్ఠింపబడిన శివలింగం ఇక్కడ దేవస్థానంలో ఉండడంతో గొప్ప మహిమలు గల క్షేత్రమని ప్రసిద్ధి. పిల్లలు లేనివారు, మగ సంతానం పుట్టాలని కోరిక మేరకు ఇక్కడ కొబ్బరి మొక్క నాటినచో వారి కోరిక తీరుతుందని ఇక్కడ ప్రసిద్ధి. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ భారీ అన్న సమారాధన కూడా ఏర్పాటు చేస్తారు.ఈ మేరకు చైర్మన్ కర్ర సత్య వెంకట వెంకట రాజేష్, ఈవో కే విద్యాసాగర్, అర్చకులు ర్యాలీ సూర్య ప్రకాష్ రావు తెలిపారు. ఈసారి భక్తులకు స్వామి వారి దర్శనానికి అనువుగా ఉండే విధంగా భారీ కేడ్లు ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. హోమాలు,లింగోద్భవ దృశ్యాలు భక్తులకు కళ్ళకు గట్టినట్లు ఉండే విధంగా ఆకర్షణయంగా తీర్చిదిద్దినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. తెల్లవారుజామున 3 గంటలకు దర్శనం ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 50 రూపాయల దర్శనం టికెట్లు కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎంతో మహత్యం గల స్వామి అమ్మవార్లను దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని చైర్మన్ రాజేష్, ఈవో విద్యాసాగర్ కోరారు.

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు

- ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు,ఫిబ్రవరి 13 మనం న్యూస్ః** మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శివాలయాలు మరియు ఇతర దేవాలయాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. డీఎస్పీలు, సీఐలు,ఎస్సైలతో జిల్లా ఎస్పీ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భద్రత, ట్రాఫిక్ మరియు పలు అంశాలపై సమీక్షించి పలు సూచనలు తెలియచేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రధాన శివాలయాలు ప్రాంతాల్లో జరిగే జాతరలు, ప్రత్యేక పూజలు, రాత్రి జాతర కార్యక్రమాలు వంటి వాటిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాల వద్ద అదనపు సిబ్బందిని మోహరించాలని, మహిళా భక్తుల భద్రత దృష్ట్యా మహిళా పోలీసులను నియమించాలని ఆదేశించారు.భక్తులు క్యూలైన్లో సజావుగా దర్శనం చేసుకోవటానికి బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, తోపులాటలు, గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ఎక్కువగా జరిగే కార్యక్రమాల సందర్భంలో ప్రత్యేక గస్తీ బృందాలను నియమించాలని, సీసీటీవీ, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించాలని సూచించారు.ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆలయాల సమీపంలో తాత్కాలిక పార్కింగ్ ప్రదేశాలు గుర్తించి, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ మళ్లింపులు చేయాలన్నారు. దర్శనానికి వచ్చే వారు భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విలువైన నగలు, మొబైల్ ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ప్రశాంత వాతావరణంలో భగవంతుని దర్శించుకునేలా జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు.జిల్లాలో పొదిలి, త్రిపురాంతకం, భైరవకోన, మడనూరు మరియు మొదలైన ప్రాంతలోన్ని ప్రముఖ దేవాలయాలు వద్ద శివరాత్రి ఉత్సవాలు మరియు రథోత్సవాలు జరుగుతున్నాయని, పండుగ ఉత్సవాలు, ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎక్కువ సిబ్బందితో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని, దోర్నాల - శ్రీశైలం ఘాట్ రోడ్డు లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, పూర్తి స్థాయి బందోబస్తుతో అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఏమైనా ఉంటే స్థానిక పోలీసు వారికి గాని లేదా 112/100 నంబర్లకు గాని తెలియపరచాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

## తక్షణమే పిఆర్‌సి వేయా



- ఎస్ టి యు డిమాండ్

**భీమవరం, ఫిబ్రవరి 13,మనం బ్యూరోః** ఎస్ టి యు ఆధ్వర్యంలో ఆర్థిక బకాయిలపై భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా లో ప్రభుత్వం వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని,30 శాతం ఐఆర్ ను ప్రకటించాలని డిమాండ్ చేశారు మరియు ఆర్థిక ప్రయోజనాలన్నీ విడుదల చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర,జిల్లా నాయకులతో పాటు పాలకొల్లు ఎస్ టి యు పట్టణ శాఖ అధ్యక్షులు ఆ ర్ . భవానీ ప్రసాద్ ,ప్రధాన కార్యదర్శి డి. రాజ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం ఉదృతం చేస్తామని తెలిపారు. జి . శ్రీనివాస్ ,ఎం . విక్రాంత్ విజయ్ ,ఏ .చల్లా రావు ,జె . నాగేశ్వర రావు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



**విశాఖపట్నం, మనంన్యూస్ః** బిల్ జంక్షన్ హాల్ సమావేశ మందిరం నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు వారి అధ్యక్షతన ముఖ్య అతిదిగా విచ్చేసిన గౌరవ శ్రీ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీందర ప్రసాద్ వారు ప్రోగ్రాం అధికారులను మరియు పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాదికారులను అన్ని ఆరోగ్య కార్యక్రమాల మీద సమీక్ష చేశారు. వీటిలో ముఖ్యమైనవి ఎన్.సి.డి. 4.0 స్క్రీనింగ్ నెమ్మదిగా జరుగుతుందని, ఇది శతశాతం అయ్యేలా చూడాలని రిఫరల్స్ ఎక్కువగా అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. తదుపరి మాతా శిశు మరణాల గురించి సమీక్షిస్తూ హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి తగు సలహాలు ఇవ్వాలని, 2ృ ఎకో చేయించాలని, అవసరమైన వారికి టిఫా స్కాన్ చేయించాలని సూచించారు. తదుపరి శిశు మరణాల గురించి ప్రస్తావిస్తూ కౌమార దశలో గల గర్భిణీలను, హైరిస్క్ గర్భిణీలను గమనించి మరియు మామ్ చిల్డ్రెన్ ను సకాలంలో ా్రఖ కి రిఫర్ చేయవలెను. శిశు మరణాలకు గల సరైన కారణాలు గుర్తించి అటువంటి మరణాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచి ంచారు. తదుపరి స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిమిత్తం, హాస్టల్స్ మరియు స్కూల్స్ నందు వైద్యాధికారి తప్పనిసరిగా దృష్టి పెట్టాలని 4ృట మీద ఫోకస్ ఉంచాలని వైద్యులు ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని మరియు అప్పుడప్పుడు క్షేత్ర సందర్శన చేయాలని, ఓపి ని ఇంప్రూవ్ చేయాలని దీనికి సంబందించిన ఏ.ఎన్.ఎంలు, ఆశా లు మోబిలైజ్ చేయాలని ఆదేశించారు.1. ప్రోపర్ మెడికల్ ఆఫీసర్, 2.ప్రోపర్ ప్రిస్క్రిప్షన్ 3.ప్రోపెర్ డయాగ్నోసిస్ 4. ప్రోపెర్ డిస్ట్రిబ్యూషన్ అఫ్ డ్రగ్స్ 5.పోలైట్ బిహేవియర్ పాటించడంతో ఓపి ని ఇంప్రూవ్ చేసుకోవచ్చు. 100% ఉండాలని అవుట్బ్రేక్స్ వచ్చినప్పుడు ముందుగా సమాచారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి, సేఫ్ వాటర్ సప్లై వారికీ అందచేయాలి. త్రాగునీటి పైపులు లీకులు ఉన్నవేమో గమనించి సంబందిత అధికారులకు తెలియచేయాలి. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈ నెల 17 వ తేదీన అందరి పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు మోతాదు వారీగా మింగించవలెనని, ఆరోజున మిస్ అయిన వారికి 24 వ తేదిన మాత్రలు మింగించవలెనని ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని, ప్రజా ప్రతినిదులను కూడా ఇన్వాల్వ్ చేయాలని సూచించారు. చివరగా ఆసుపత్రికి వచ్చే వారినుంచి ఎటువంటి డబ్బులు వసూలు చేయరాదని మరియు 100% డ్రగ్ డిస్ట్రిబ్యూషన్ చేయాలని, హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్యులు తమ వృత్తి పట్ల నిబద్దత కలిగి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఈ సమావేశం లో జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అంకెలతో ఆటలు పదాలతో పదనిసలు పలికిస్తున్న జిఎఫ్ఎల్ఎన్



**మార్కాపురం ఫిబ్రవరి 13 మనం న్యూస్ః** గ్యారంటీడ్ ఫౌండేషన్ లిటరసీ,న్యూమరసి కార్యక్రమం ద్వారా విద్యార్థుల పఠన నైపుణ్యాలలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని ఎంఈవోలు టి.అబ్దుల్ సత్తార్, టి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక బోర్డు స్కూల్లో నిర్వహిస్తున్న జిఎఫ్ఎల్ఎన్ కార్యచరణ ప్రణాళికలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలుగు,ఆంగ్లం పాఠాలను అనర్గళంగా చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను అభినందించారు. గణితంలోని చతుర్విధ ప్రక్రియల్లో విద్యార్థుల చురుకుదనాన్ని ప్రశంసిస్తూ, జి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంతో విద్యార్థులు అంకెలతో ఆటలాడుతూ పదాలతో పదనిసలు పలికిస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను పరిశీలించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయురాలు ఖుర్షీద్ తహ్మీన్ బోధనా నైపుణ్యాలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరికుంట్ల.వెంకటేశ్వర్లు, ఐఈఆర్పీ ఈశ్వరి తదితరులు ఉన్నారు.

## కుండలేశ్వరంలో పర్యటించిన ఎస్పీ



**కాట్రేనికోన ఫిబ్రవరి 13,మనం ప్రతినిధిః** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శుక్రవారం మండల పరిధిలోని కుండలేశ్వరంలో పర్యటించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు ఎక్కువ గా వచ్చే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగర్తలు పై చర్చించారు.వృద్ధ గౌతమి నది తీరాన ఉన్న స్నాన ఘట్టాన్ని పరిశీలించారు. గజ ఈతగాల్లను అందుబాటులో ఉంచాలని, భక్తులు నదిలో లోతుకు వెళ్లకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు కుండరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్, ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్, ఎస్సై అవినాష్, గోకర కొండ సత్యనారాయణ మూర్తి, పి ఎస్ ఎన్ రాజు, మోటేపల్లి శ్రీనివాస్, శివ, తో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప గవర్నర్ పదవి పొందిన కేకే రత్నమాల



**ఆచంట ఫిబ్రవరి 13 మనం న్యూస్ః** ఆచంట మండలం భీమలాపురం గ్రామానికి చెందిన వాకర్స్ క్లబ్ అధ్యక్షులుగా ప్రజలకు అనేక సేవలు చేసిన కొత్త కనక రత్న మాల వెంకటేశ్వర్లు జిల్లా వాకర్స్ క్లబ్ఉప గవర్నర్ పదవి పొందారు భీమవరంసిహెచ్ సత్యనారాయణ కళాశాలలో ఆమె ప్రమాణ స్వీకారం చేశారు జిల్లాలో 2011 నుండి 2026 సంవత్సరం వరకు ఆచంట మండలం భీమలాపురం గ్రామ వాకర్స్ క్లబ్ అధ్యక్షులుగా కుల మతాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా అనేక సేవలు చేసి ఎన్నో అవార్డులు పొందారని కొనియాడారు అనంతరం జిల్లా వాకర్స్ క్లబ్ ఉపగవార్నర్ పదవి అందుకుని ప్రమాణ స్వీకారం చేసిన కేకే రత్నమాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ తరపున కుల మత వర్గ లింగ బేధం లేకుండా ఈ పదవి అందుకోవడం పట్ల అధిక బాధ్యత పెరిగిందని నిత్యం ప్రజలందరికీ సేవ చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## టీ 20 ఐసీసీ పురుషుల ప్రపంచ కప్ భాగస్వామిగాయాక్సిస్ మ్యాక్స్ లైఫ్ స్టార్ స్పోర్ట్స్

**విజయవాడః** ప్రముఖ జీవిత బీమా సంస్థ యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ రాబోయే ఐసీసీ ప్రపంచ కప్ 206 భారతదేశపు పురుషుల టీ 20 2026 ప్రపంచ కప్లో అసోసియేట్ పార్ట్నర్గా స్టార్ స్పోర్ట్స్ 'అమూల్ క్రికెట్ లైవ్'తో హై ఆక్టేన్ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం బ్రాండ్ను ప్రపంచంలోనే అత్యంత ఎదురుచూస్తున్న క్రికెట్ బ్లిట్జ్క్రీగ్కు కేంద్రంగా ఉంచుతుందని, ప్రీ మ్యాచ్ బిల్ అప్లు మరియు పోస్ట్ మ్యాచ్ విశ్లేషణలో అధిక ప్రభావ అనుసంధానాల ద్వారా కీలక దృశ్యమానతను నిర్ధారిస్తుందని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ డైరెక్టర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాహుల్ తల్వార్ తెలిపారు. టోర్నమెంట్ యొక్క భారీ గ్లోబల్ వ్యూయర్షిప్లోకి ప్రవేశించడం ద్వారా యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ దాని 'భరోసా' కథనాన్ని విస్తరించాలని మరియు మిలియన్ల మంది కుటుంబాల సాంస్కృతిక ఫాబ్రిక్లో ఆర్థిక రక్షణను పొందుపరచాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఐసిసి పురుషుల టీ 20 ప్రపంచ కప్ 2026 కోసం స్టార్ స్పోర్ట్స్తో మా భాగస్వామ్యం క్రీడ మరియు సంస్కృతి యొక్క కూడలిలో భరోసా కథనాన్ని ఎంకరేజ్ చేస్తుందన్నారు. మా కోసం,క్రికెట్ అనేది రీచ్ వెహికల్ కంటే ఎక్కువ; ఇది ఒక శక్తివంతమైన వినియోగదారు ప్లాట్ఫారమ్, ఇక్కడ పనితీరు, రక్షణ మరియు వారసత్వానికి సంబంధించిన సంభాషణలు కలిసి వస్తాయని చెప్పారు.

## భావితరాల భవిష్యత్తు వృత్తిరీత్యా కోర్సులతోనే సాధ్యం

- ప్రధానోపాధ్యాయులు బొమ్మి శెట్టి జగ్గారావు



**శంఖవరం ఫిబ్రవరి 13 మనం ప్రతినిధిః** విద్యార్థులకు భవిష్యత్తులో వృత్తిరీత్యా కోర్సులు దోహదపడతాయని శ్రీ పర్వత సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బొమ్మిశెట్టి జగ్గారావు తెలిపారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రమైన శంఖవరం శ్రీ పర్వత సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తిరీత్యా కోర్సుల శిక్షణలలో భాగంగా ఆటోమోటివ్, అగ్రికల్చర్, బ్యాంకింగ్ పై అవగాహన పై శిక్షణ కల్పిస్తున్నారు. దానిలో భాగంగానే శుక్రవారం వృత్తిరీత్యా కోర్సుల నేపథ్యంలో విద్య వైజ్ఞానిక యాత్రలో భాగంగా సుమారు 70 మంది విద్యార్థులను రావికంపాడులో గల దారాలు తయారు చేసే పరిశ్రమను సందర్శించడం జరిగిందని దారాల యంత్రాల ద్వారా తయారుచేయు విధానం విద్యార్థులు నేరుగా పరిశీలించి శాస్త్రీయ దృక్పథాన్ని తెలుసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మిశెట్టి జగ్గారావు తెలిపారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో గల పట్టు పరిశ్రమ కేంద్రాన్ని సందర్శించి మలబారి మొక్కల పెంపకం పట్టు గుళ్ళు పట్టుపురుగు పెంపకం గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి కళాశాలలో గల వివిధ ల్యాబ్లలో గల యంత్రాలు పనితీరు తెలుసుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శాస్త్రీయ అవగాహన సైన్స్ పట్ల ఇష్టం అగ్రికల్చర్ రంగం విశిష్టత ఆటోమొబైల్ యంత్రాల పనితీరు కంప్యూటర్ ద్వారా బ్యాంకింగ్ విషయాలు తెలుసుకున్నారని తెలిపారు. విద్య వైజ్ఞానిక యాత్రలో పాల్గొన్న విద్యార్థులకు భోజన సదుపాయాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తిరీత్యా కోర్సులు శిక్షణ ఉపాధ్యాయులు డి. పార్వతి, దుర్గ మణికంఠ, మాధురి హరికృష్ణ కిషోర్ సూర్యవతి పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం పశ్చిమం మనం న్యూస్ ఫిబ్రవరి 13: అసెంబ్లీ సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ప్రభుత్వ విప్ గణబాబు,తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు కలిశారు.విశాఖపట్నంలో భారత ప్రభుత్వ సహకారంతో జాతీయ క్రీడా సంస్థ కేంద్రాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు ని విజ్ఞప్తి చేశారు.ఈ కేంద్రం ఎన్ఐఎస్ సెంటర్ ద్వారా యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, కోచింగ్, క్రీడా విజ్ఞాన సదుపాయాలు లభించి క్రీడా ప్రతిభ అభివృద్ధి చెందుతుంది. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు మాత్రమే కాకుండా దేశ క్రీడాభివృద్ధికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

కాబట్టి విశాఖపట్నంలో ఎన్ ఐ ఎస్ కేంద్రం స్థాపనకు భారత ప్రభుత్వానికి ముఖ్యమంత్రి సిఫార్సు అందించవలసిందిగా కోరారు. విశాఖపట్నంలో రానున్న మెట్రో రైల్ ప్రాజెక్ట్స్ మౌలిక సదుపాయాల పై సలహాలు నివేదిస్తూ చర్చించారు.

## పోలీసు శాఖకు ఏ.ఆర్ విభాగం ప్రత్యేకమైనది, వైవిధ్యమైనది,

- జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి





పార్వతీపురం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి: ఏ.ఆర్ బలగం వార్షిక మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆర్మ్ డ్ రిజర్వు పోలీసుల సేవలను జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి కొనియాడారు.వివిధ ఆయుధాల వినియోగం, వివిధ రకాల విధుల నిర్వహణ గురించి మొబిలైజేషనులో ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు.లైఫ్ సేవింగ్ ప్రొసీజర్ల, సేఫ్టీ డ్రైవింగ్, ఫైర్ ఫైటింగ్ మరియు విపత్తు నిర్వహణ, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా, ఆర్థిక క్రమశిక్షణ, సర్వీసు రూల్స్, సంక్షేమం పట్ల పోలీసు సిబ్బందికి శిక్షణలో అవగాహన కల్పించామనీ,క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలనీ,ప్రతి సంవత్సరం పార్వతీపురం మన్యం జిల్లా ఏ.ఆర్ బలగానికి వార్షిక పునఃశ్చరణ తరగతుల(మొబిలైజేషన్) ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారన్నారు జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఆదేశానుసారం ఈ సం. 30-01-2026 న జిల్లా సాయుధ దళం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నందు 15 రోజుల వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం మొదలైంది. దీనిలో భాగంగా ఫిబ్రవరి 13న జరిగిన ముగింపు(డి - మొబిలైజేషన్ ) కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా వేదికకు చేరుకున్న జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,ఐపిఎస్ కి ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి పూలమొక్కతో స్వాగతం పలుకగా, పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలోని పోలీసు దళం ఎస్పీ కి సెల్యూట్ సమర్పించారు. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సభా వేదిక వద్దకు చేరుకోగా, ఎస్పీ అనుమతితో పరేడ్ కమాండర్ ఆర్ఐ నాయుడు అధ్వర్యంలో పోలీసు దళాలు కవాతు నిర్వహించాయి.ఈ సందర్భముగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా సాయుధ బలగాలకు 15 రోజులు పాటు కొనసాగిన పునఃశ్చరణ తరగతుల(మొబిలైజేషన్) కార్యక్రమంలో ఏ ఆర్ సిబ్బంది మరియు అధికారులకు పెరేడ్ నిర్వహణ, విఐపి సెక్యూరిటీ, రక్షణ, ఆయుధాలను ఉపయోగించడం లో మెళకువలు మరియు ఫైరింగ్ ప్రాక్టీసు, బందోబస్తు నిర్వహించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అత్యవసర పరిస్థితులలో ఎం ఓ బికంట్రోల్, అంబుస్ మరియు కౌంటర్ అంబుస్ అంశాలపై ప్రత్యేక శిక్షణ, వివిధ రకాల ఆయుదాలతో ఫైరింగ్, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా, ఆర్థిక క్రమశిక్షణ, సర్వీసు రూల్స్, సంక్షేమం వంటి అన్ని రకాల నైపుణ్యాలను పోలీసు సిబ్బందికి పునః సమీక్షించి వాటిలో నిష్ణాతులుగా చేయడం జరిగిందని, ఏ ఆర్ బలగము జిల్లా బలగానికి వెన్నెముఖ లాంటిదని, వీరి ఉద్యోగం వైవిధ్యభరితమే కాకుండా కష్టతరమని తెలుపుతూ ఈ 15 రోజుల నైపుణ్య పునః చ్చరణ కార్యక్రమంలో భాగంలో ప్రభుత్వ వైద్యుల సహకారంతో సిబ్బంది అధికారులకు ఫస్ట్ ఎయిడ్, లైఫ్ సేవింగ్ ప్రొసీజర్ల పై అవగాహన కల్పించడం ప్రత్యేక విశేషం. ఆపద సమయంలో ప్రాణాలు రక్షించేందుకు మీరు సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా జిల్లా ఫైర్ ఆఫీస్ వారి సాహకరంతో ఫైర్ ఫైటింగ్ మరియు విపత్తు నిర్వహణ పై అగ్నిని అదుపు చేయడం మరియు ఆపద సమయాలలో ప్రజల ప్రాణాలు ఎలా కాపాడాలి అని అవసరమైన ముఖ్య నైపుణ్యాలను అందిపుచ్చుకున్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన, సేఫ్టీ డ్రైవిం వంటి నైపుణ్యాలు పోలీసు సిబ్బంది సాధన చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అన్ని రకాల నైపుణ్యాలను పూర్తి క్రమ శిక్షణ తో నేర్చుకోవడం అభినందనీయమని కొనియాడుతూ, తమ విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం పెంపొందించేలా ఈ కార్యక్రమం రూపొందించినందుకు ఏ.ఆర్ అధికారులైన ఏ.ఆర్. డి.ఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ ఐ అడ్మిన్ రాంబాబు, ఆర్ ఐ ఎం టి ఓ నాయుడు లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మొబిలైజేషన్ కార్యక్రమంలో జనరల్ డ్యూటీ చేసే సిబ్బంది తో పాటు మోటార్ ట్రాన్స్పోర్ట్ వింగ్, సెక్యూరిటీ వింగ్, గన్ మ్యాన్ లు, డాగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ, బ్యాండ్ పార్టీ మొదలైన విభాగాలలో ఉన్న సిబ్బంది పాల్గొని తమ నైపుణ్యాలను పెంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, పార్వతీపురం పట్టణ సిఐ వెంకట్రావు, ఆర్ఐ లు రాంబాబు, పెరేడ్ కమాండర్ నాయుడు ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పణ



మహానంది, ఫిబ్రవరి13,మనంన్యూస్ః మహాశివరాత్రి బ్రహ్మ బ్రహ్మోత్సహల సందర్భంగా శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్ల కు పట్టు వస్త్రాలను అందజేశారు. శుక్రవారం హైదరాబాదు కు చెందిన వారణాసి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలను ఆలయ కార్యనిర్వాహనాదికారి శ్రీనివాస రెడ్డి కి అందజేశారు.ప్రతి సంవత్సహారం స్వామి అమ్మవార్ల కల్యాణానికి ఆనవాయితీగా పట్టువస్త్రాలు అందజేస్తున్న విషయం తెలిసిందే.ఈ సందర్బంగా వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మలు దాతలను వేదమంత్రోచ్చారణ మధ్య ఆశీర్వచనం చేసి స్వామివారి మెమెంటో తో పాటు ప్రసాదాలను అందజేశారు.

## శివరాత్రి ఉత్సవాల్లో లోపాలు ఉండకూడదు

- జూచక్రతీర్థ స్నానాలపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన విశాఖపట్నం రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ



శ్రీకాకుళం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి : జలుమూరు మండలం, శ్రీముఖలింగం గ్రామంలోని ప్రసిద్ధ శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుండి 18 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, ఆదేశించారు.ఆదివారం జరిగే శివరాత్రి వేడుకలతో పాటు, ముఖ్యంగా (ఫిబ్రవరి 18)వంశధార నది పరివాహక ప్రాంతంలో నిర్వహించనున్న చక్రతీర్థ స్నానాలు లక్షలాది మంది భక్తులను ఆకర్షించే అవకాశమున్నందున, అక్కడ భద్రతా ఏర్పాట్లు, రాకపోకల నియంత్రణ, క్యూలైన్ వ్యవస్థ, బ్యారికేడింగ్, అత్యవసర మార్గాలు, పార్కింగ్ స్థలాలు తదితర అంశాలను రేంజ్ ఐజీ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, తో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, గర్భగుడి క్యూలైన్లు, చక్రతీర్థ ఘాట్ ప్రాంతం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ అంశాలను సమీక్షించారు. ఇతర శాఖలతో సమన్వయం చేస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా అండ్ ఆర్డర్ సిబ్బందితో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను కంట్రోల్ రూమ్కు అనుసంధానం చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామని తెలిపారు. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా మార్గదర్శకాలు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాలు, సముచిత లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఫిబ్రవరి 18న స్వామివారి ఉత్సవ విగ్రహాలు నందివాహనంపై ఆలయం నుండి బయలుదేరి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంశధార నది పరివాహక ప్రాంతానికి చేరుకుని చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్న నేపథ్యంలో, మార్గమధ్యంలో ఇరువైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, భక్తుల నియంత్రణకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రశాంతంగా స్నానాలు జరిగేలా సమగ్ర కార్యాచరణ రూపొందించామని అధికారులు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శివరాత్రి చక్రతీర్థ స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశమున్నందున తగిన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులు పరస్పర సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. బందోబస్తు కార్యాచరణ వివరాలు రేంజ్ ఐజి కి జిల్లా ఎస్పీ వివరించారు. భక్తులు పోలీసు సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో పోలీసు, రెవెన్యూ, ఆలయ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించిన పర్వత జానకి రాజబాబు



శంఖవరం ఫిబ్రవరి 13 మనం ప్రతినిధిః కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థాన ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే సామాగ్రిని జిల్లా లైన్స్ క్లబ్ చైర్ పర్సన్ పర్వత జానకి రాజబాబు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్య ప్రయాణంలో 10వ తరగతి పరీక్షలు కీలక మైలురాయని సూచించారు. గత కొన్ని రోజుల క్రిందట విద్యార్థులకు అల్పాహారం అందించడం జరిగిందని, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల పరీక్షల సమయంలో ఉపయోగపడే సామగ్రిని అందించమని కోరిన మేరకు సావాగ్రిని అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్షలలో మంచి ఉత్తీర్ణతను సాధించి, పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువనేత పర్వత వివేకనంద, మాజీ ప్రిన్సిపాల్ డోంకాడ గిరి,లయన్స్ క్లబ్ సభ్యులు బుద్దిగా వాసు,తుమ్మల సత్యేంద్ర, చేనేత సంఘం అధ్యక్షుడు నానాజీ, సెక్రెటరీ పొన్నాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహానందీశ్వరుని కంకనదారణ



మహానంది, ఫిబ్రవరి13,మనంన్యూస్ః మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానందీశ్వర స్వామివారికి కంకనదారణ చేశారు. ఉత్సవాలలో భాగంగా శ్రీకామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామివారికి కళ్యాణం నిర్వహించడం జరుగుతుంది.అందులో భాగంగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారామ్ భట్, హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ, అర్చకులు, పరిచారకుల వేద మంత్రోత్సరణ మధ్య ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి కంకనదారణ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా ఆధార్ సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



అల్లూరి జిల్లా పాడేరు మనం న్యూస్ ఫిబ్రవరి 13: జిల్లాలో ప్రతి గ్రామ సచివాలయాలు, పోస్టాఫీసుల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. సదరు కేంద్రాలలో ఆధార్ నమోదు, తప్పుల సవరణ మరియు బయోమెట్రిక్ నవీకరణ చేసుకోవచ్చని తెలిపారు.

ఈ రోజు సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఆధార్ మోనటరింగ్ కమిటీ సమావేశంలో పలు సూచనలు చేశారు. అల్లూరి జిల్లాలో ప్రతీ ఒక్కరికీ ఆధార్ కార్డు జారీకి చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం మంజూరు చేసిన ఆధార్ కిట్స్ సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు నోడల్ అధికారి కుమార్ కు సూచించారు. ప్రతీ ఆధార్ కేంద్రం వద్ద సర్వీస్ చార్జీల వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు మరియు కళాశాలలో బయోమెట్రిక్ నవీకరణ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్ అధికారిని ఆదేశించారు.

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు తరచుగా ఆధార్ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతీ మూడు నెలలకు జిల్లా స్థాయి సమీక్ష ఏర్పాటు చేయాలని,100సంవత్సరాలు పైబడి జీవించిన వారి ఆధార్ కార్డుల నవీకరణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు నోడల్ అధికారి పి. యస్. కుమార్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకులు రైతులు సమస్యలను పట్టించుకోరు



నందవరం ఫిబ్రవరి 13 మనం న్యూస్ః నందవరం మండలంలోని నందవరం గ్రామానికి చెందిన రైతన్నలు నందవరం రోడ్డు టు హాలహర్వి వెళ్లే రహదారిని మూడు కిలోమీటర్ల దాకా రైతులు సొంత నిధులతో ముళ్ళు కంపులను తొలగించడం జరిగింది రైతులు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు రైతులు కష్టాలను పట్టించు కోవడంలేదని వాళ్ల అవసరాలు కోసమే మాత్రమే మమ్మల్ని ఉపయోగించుకుంటున్నారని రైతులు తెలియజేశారు సుమారుగా నాలుగు కిలోమీటర్ల దాకా నందవరం నుండి హాలహర్వి వెళ్లే రహదారిని ముళ్ళు కంపలను ఎవరూ పట్టించుకోవటం వలన ఎంతమంది రాజకీయ నాయకులు ఉన్నా కూడా రైతులు కష్టాలు ఎవరికీ పెట్టవు వాళ్ళు అవసరాల కోసమే మమ్మల్ని ఉపయోగించుకుంటున్నారని తెలియజేశారు ఇప్పటికైనా మా మీద దయవుంచి రోడ్డుకు ఉన్న ముళ్ళు కంపలను తొలగించి రోడ్డు మరమ్మతులు చేయించవలసినదిగా కోరడమైనది ఈ కార్యక్రమంలో నందవరం గ్రామా రైతులు పాల్గొన్నారు.

## ఆచంటేశ్వరుని ఉత్సవాలకు పగడ్బందీ ఏర్పాట్లు

ఆచంట ఫిబ్రవరి 13 మనం న్యూస్ : నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో ఈశ్వరుని ఉత్సవాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఆచంటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు నెక్కంటి గజేశ్వర రావు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాస రంగరాజు అన్నారు శుక్రవారం పత్రికా విలేకరులతో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు.

భక్తులు దర్శనానికి వీలుగా క్యూ లైన్లు బార్కెట్లు ఏర్పాటు చేశామని అన్నారు భక్తుల పుణ్యస్నానాలు ఆచరించేందుకు నీరు కొరత లేకుండా ఉందని తెలిపారు నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందని అన్నారు అంతేకాక ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు పారిశుద్ధ్యం సమస్య లేకుండా సంబంధిత అధికారులు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షించే కార్మికులు ను ఏర్పాటు చేశామని అన్నా రు అంతేకాక ప్రజల అత్యవసర వైద్యం అందించేందుకు 104 మరియు 108 వాహనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు తెలుగు రాష్ట్రాల నలువైపుల నుండి ఆచంటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని పోలీసులు నిఘా ఉంటుందని అన్నారు.

## అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి టీజీ భరత్



కర్నూలు ఫిబ్రవరి 13మనం న్యూస్ః బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ రెండు బిల్లులు ప్రవేశపెట్టారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు బదులుగా మంత్రి టీజీ భరత్.. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల బిల్లు 2026ను, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల 2వ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లులు సభ ఆమోదం పొందినట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రకటించారు.

## గజ్జా పెద్ద రామయ్యమృతికి నివాళులర్పించిన మాజి ఎమ్మెల్యే అన్నా



పొదిలి, ఫిబ్రవరి 13 మనం న్యూస్ః మార్కాపురం జిల్లా పొదిలి మండలం నంది పాలెం యస్సి పాలెం నందు గజ్జా పెద్ద రామయ్య మృతి చెందగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు పెద్ద రామయ్య గారి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## సాగరమాల ద్వారా హార్బర్ల ఆధునీకరణ

### ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి

### ముత్యాలమ్మపాలెం మినీ జెట్టీపై ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనం



అమరావతి / ఉత్తరాంధ్ర ఫిబ్రవరి 13 మనం న్యూస్ ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన సాగరమాల వంటి కేంద్ర పథకాల సహకారంతో రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో మినీ జెట్టి / ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోస్తా ప్రాంత అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల స్థితిగతులు, ముత్యాలమ్మపాలెం ప్రాజెక్ట్ పురోగతి గురించి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. దీనికి సమాధానంగా వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి 12 కోస్తా జిల్లాల్లో కలిపి 1053.07 కి.మీ తీరప్రాంతం ఉండగా, 350 ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్లు గుర్తించబడ్డాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టామని, 2020 సంవత్సరం జులై 15 నుంచి ఫిషింగ్ హార్బర్లు మత్స్యశాఖ నుంచి పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. తొలి దశలో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉండగా, రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, వోడరేవు హార్బర్లు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు., పి ఎం ఎం ఎస్ వై సాగరమాల, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో విశాఖ హార్బర్ ఆధునీకరణ పనులు రూ.178.51 కోట్లతో కొనసాగుతున్నాయని, కాకినాడ హార్బర్ ఆధునీకరణకు రూ.58.95 కోట్లతో డి పి ఆర్ సిద్ధం చేయడానికి సీఐసీ ఈఎఫ్ అంగీకరించిందని వివరించారు. అలాగే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల విషయంలో అంతర్వేది పల్లిపాలెం, గుండయపాలెంలో జెట్టీ సౌకర్యాలతో కార్యకలాపాలు సాగుతున్నాయని, భావనపాడు ఎఫ్ ఎల్ సి కు నది ముఖద్వారం స్థిరీకరణ కోసం అవసరమైన సాంకేతిక చర్యలను ఏపీఎంబికు తెలియజేశామని చెప్పారు. పి ఎం ఎం ఎస్ వైకింద రూ.126.91 కోట్లతో దొండువాక, ఉప్పలంక, భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువు లో ఎఫ్ ఎల్ సిల అభివృద్ధి టెండరింగ్ దశలో ఉందన్నారు. మచిలీపట్నం, బియ్యపుతిప్ప ఎఫ్ ఎల్ సి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం ప్రాంతానికి సంబంధించి ప్రజల అభ్యర్థన మేరకు సిఐసీఈఎఫ్ ద్వారా ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనాలు నిర్వహించబడినట్లు, తుది నివేదికలు అందాల్సి ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. నివేదికలు వచ్చిన వెంటనే సాంకేతిక సాధ్యత ఆధారంగా మినీ జెట్టి / ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణంపై తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కోస్తా ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు కట్టుబడి ఉందని, అవసరమైన అన్ని మౌలిక వసతులు దశలవారీగా అభివృద్ధి చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన ఈ ఆధునీకరణ కార్యక్రమాలు పూర్తయ్యాక కోస్తా ప్రాంతాల్లో మత్స్యరంగానికి కొత్త ఊపొస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



## కెనడాపై యూఏఈ విజయం

### ఆర్యాన్ష్, సోహైబ్ హాఫ్ సెంచరీలు..

టీ20 ప్రపంచ కప్ లో యూఏఈ తొలి విజయం నమోదు చేసింది. కెనడాపై ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో యూఏఈ 19.4 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆర్యాన్ష్ శర్మ (74₹), సోహైబ్ ఖాన్ (51) అర్ధశతకాలతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. కెనడా బౌలర్లలో బిన్ జాఫర్ 3, కలీమ్, జస్కరణ్ సింగ్ ఒక్కో వికెట్ తీశారు.



## అదంతా అప్పుడండి.. ఇప్పుడు నేను మారిపోయాను: ఇషాన్ కిషన్

టీ20 ప్రపంచకప్ లో భాగంగా ఈనెల 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అందరి చూపు విచిత్రమైన యాక్షన్ తో బౌలింగ్ చేస్తున్న ఉస్మాన్ తారిక్ పైనే ఉంది. అయితే అతడిని ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని టీమ్ఇండియా బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. నమీబియాతో మ్యాచ్ అనంతరం అతడు విలేకర్లతో మాట్లాడాడు.

'మేం ఇప్పటికే అతడి (ఉస్మాన్ తారిక్) బౌలింగ్ ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేం బంతిని చూస్తూ.. మా సహజసిద్ధమైన ఆటను ఆడాల్సిన సమయం వచ్చింది. మేం స్కోర్ బోర్డ్ మీద మంచి టోటల్ ఉంచాలనుకుంటున్నాం. కొన్ని వీడియోలు చూడటంతో అతడి బౌలింగ్ మీద మాకో అవగాహన వచ్చింది' అని ఇషాన్ కిషన్ అన్నాడు. న్యూజిలాండ్ సిరీస్ నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని, ఆ ప్రదర్శన తమలో ఆత్మవిశ్వాసం నింపిందని ఇషాన్ కిషన్ అన్నాడు. 'పరుగులు సాధించడం బ్యాటర్లకు మంచి విషయం. గత సిరీస్ నుంచి మేం బాగా ఆడుతున్నాం. న్యూజిలాండ్ తో జరిగిన మ్యాచుల నుంచి మేం చాలా నేర్చుకున్నాం. ఆ సిరీస్ తో మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది' అని ఇషాన్ కిషన్ వివరించాడు.

గతంలో తాను జోక్స్ తో ఎక్కువ కాలక్షేపం చేసేవాడినని.. ప్రస్తుతం తాను క్రికెట్కే ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని ఇషాన్ కిషన్ అన్నాడు. 'నిజం చెప్పాలంటే నేను ఇప్పుడు మారిపోయిన మనిషినని అనుకుంటున్నాను. ఎందుకంటే నాకు జోకులంటే చాలా ఇష్టం. గతంలో నేను జోక్స్తో కాలక్షేపం చేసేవాడిని. కానీ ఇప్పుడు ఆ సమయాన్ని రెండు, మూడు గంటలకు తగ్గించాను. ప్రస్తుతం బ్యాటింగ్, నా వికెట్ కీపింగ్ మీదే ఎక్కువ దృష్టి పెడుతున్నాను. ఇది జట్టుకు, అలాగే నాకూ ప్రయోజనకరం. క్రికెట్ తర్వాతే ఏదైనా' అని కిషన్ పేర్కొన్నాడు.




## ఆసీస్‌ను చిత్తు చేసిన జింబాబ్వే

కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్ లో ఆస్ట్రేలియాపై జింబాబ్వే 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 169/2 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ 19.3 ఓవర్లలో 146 పరుగులకే పరిమితమైంది. మాట్ రెన్షా (65) హాఫ్ సెంచరీ చేసినా ఫలితం లేకుండా పోయింది. తన జట్టును గెలిపించలేకపోయాడు. రెన్షాతోపాటు గ్లెన్ మ్యాక్స్ వెల్ (31), ట్రావిస్ హెడ్ (17) మినహా ఎవరూ రెండంకెల స్కోరు చేయలేదు. జింబాబ్వే బౌలర్ ముజర్బానీ (4/17) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతడితోపాటు బ్రాడ్ ఇవాన్స్ 3.. మసకద్జ, బర్ల్ చెరో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ముజర్బానీ నిలిచాడు. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన జింబాబ్వేకు ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (64), మరుమణి (35) తొలి వికెట్ కు అర్ధశతక భాగస్వామ్యం నిర్మించారు. మరుమణి ఔటైనా.. రైయాన్ బర్ల్ (35), సికందర్ రజా (25₹)తో కలిసి బెన్నెట్ ఇన్నింగ్స్ ను నడిపించాడు. హాఫ్ సెంచరీ సాధించి చివరి వరకూ క్రీజ్ లో నిలిచాడు. దీంతో ఆసీస్ ఎదుట 170 పరుగులను లక్ష్యంగా ఉంచారు. ఆసీస్ బౌలర్లు స్టొయినిస్, గ్రీన్ ఒక్కో వికెట్ తీశారు. బౌలింగ్ చేస్తుండగా మరుమణి కొట్టిన బంతి స్టొయినిస్ చేతిని బలంగా తాకింది. దీంతో అతడు మైదానం వీడాడు. అయితే, లక్ష్య ఛేదన సమయంలో స్టొయినిస్ బ్యాటింగ్ కు వచ్చినా పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు.

## 'రంగస్థలం' ఇంపాక్ట్..

# జగపతి బాబు

### ఇంట్రెస్టింగ్ కామెంట్స్ వైరల్!



టాలీవుడ్ సినిమా దగ్గర కొన్ని ట్రెండ్ సెట్టింగ్ సినిమాల జాబితాలో ఖచ్చితంగా ఉండే అతి కొద్ది సినిమాల్లో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సమంత హీరోయిన్ గా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన విలేజ్ రివెంజ్ డ్రామా రంగస్థలం తప్పకుండా వుంటుంది. అయితే ఈ సినిమాలో ప్రతీ ఒక్క నటుడు పోషించిన పాత్రలు తమ కెరీర్ నే ఓ రేంజ్ లో మలుపు తిప్పాయి. అలా గుర్తుండిపోయే పాత్రల్లో వెర్సటైల్ నటుడు జగపతి బాబు పోషించిన ప్రెసిడెంట్ గారు పాత్ర కూడా ఒకటి. దీనిపై జగపతి బాబు లేటెస్ట్ కామెంట్స్ వైరల్ గా మారాయి. తన కెరీర్లో చాలా తక్కువ పాత్రలు మాత్రమే తను గుర్తు పెట్టుకునే విధంగా ఉంటాయి అన్నట్టు తెలిపారు. గత 70, 80 సినిమాల్లో చూసుకుంటే ఐదారు సినిమాల్లో పాత్రలు మాత్రమే గుర్తుంటాయని ఆ తక్కువలో కూడా రంగస్థలం లో చేసిన పాత్ర కూడా ఒకటని తను తెలిపారు. అదే ఏడాదిలో వచ్చిన అరవింద సమేత లో రోల్ కంటే దీనినే పిక్ చేసుకుంటాను అని రీసెంట్ ఇంటర్వ్యూలో జగ్గూ భాయ్ తెలిపారు. సో రంగస్థలం క్రియేట్ చేసిన ఇంపాక్ట్ ఆ లెవెల్ అని చెప్పవచ్చు.

## సిద్ధుతో చేతులు కలుపుతున్న హసిత్..

# డబుల్ ఫన్ ఖాయం..?

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలీ తన తదుపరి భారీ ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. 'రాజ రాజ చోర'తో కమర్షియల్ హిట్ కొట్టి, 'స్వాగ్'తో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న హసిత్, ఈసారి 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డతో జతకట్టబోతున్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉంది. త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ సినిమా కథాంశం కూడా హసిత్ గోలీ మార్క్ వినోదంతో నిండి ఉంటుందని సమాచారం. అయితే ఈసారి కామెడీతో పాటు బ్యాక్ గ్రౌండ్ సెటప్ చాలా కొత్తగా ఉండేలా దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ ఎనర్జీకి హసిత్ రాసుకున్న విభిన్నమైన పాత్ర తోడైతే బాక్సాఫీస్ వద్ద నవ్వుల జాతర ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. పూర్తి స్థాయి వినోదభరిత చిత్రంగా ఈ ప్రాజెక్టును రూపొందించేందుకు చిత్ర బృందం కసరత్తు చేస్తోంది. మరోవైపు సిద్ధు జొన్నలగడ్డ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' ఫేమ్ స్వరూప్ తో చేస్తున్న సినిమాతో పాటు, సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ లో 'బ్యాడ్ యాజ్', 'కోహినూర్' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. వీటికి తోడు 'టిల్లు క్యూబ్' కూడా ఈ ఏడాదిలోనే పట్టాలెక్కే ఛాన్స్ ఉంది. ఇన్ని ప్రాజెక్టుల మధ్య హసిత్ గోలీ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందో చూడాలి.





# మెరిసిన ఈ 'సీరియల్' బ్యూటీ ఎవరో తెలుసా?

మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. సంక్రాంతి పండుగకు థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రికార్డులు క్రియేట్ చేసిందో మనందరికీ తెలిసిందే. దాదాపు 350 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టి రీజనల్ ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఇక ఇప్పుడు ఈ సినిమా ఫిబ్రవరి 11 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ జీ5 తెలుగులో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లో మిస్ అయిన వాళ్లు ఇప్పుడు ఇంట్లోనే చూసి ఎంజాయ్ చేస్తున్నారు.

ఈ సినిమాలో ఆడియెన్స్ని, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ని బాగా ఆకట్టుకున్న అంశాల్లో 'టీవీ సీరియల్' ట్రాక్ ఒకటి. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు బ్యాక్ గ్రౌండ్ లో ఒక సీరియల్ రన్ అవుతూ ఉంటుంది. అందులో మన శంకర వర ప్రసాద్ గారి పాత్రలో చిరంజీవి.. ఆ సీరియల్ గురించి, అందులోని క్యారెక్టర్ల గురించి చెప్పే డైలాగ్స్ చాలా ఫన్నీగా వర్కౌట్ అయ్యాయి. ఆయన లైఫ్ ఆ సీరియల్ తో లింక్ అయినట్లు చూపించడం ప్రేక్షకులకు బాగా నచ్చింది. అయితే, ఆ సీరియల్ లో 'సౌమ్య' అనే హీరోయిన్ పాత్రలో కనిపించిన అమ్మాయి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఆమె ఎవరంటూ నెటిజన్లు గూగుల్, ఇన్ స్టాగ్రామ్ లో తెగ వెతికేస్తున్నారు.

ఆమె పేరే సాయి ప్రియా రెడ్డి. ఈమె ఇండస్ట్రీకి కొత్తేమీ కాదు, మనకు బాగా తెలిసిన మొహమే. గతంలో చైల్ ఆర్టిస్ట్ గా ఎన్నో పెద్ద సినిమాల్లో నటించింది. క్షేత్రం, నందీశ్వరుడు, పూలరంగడు, రెబెల్, మిర్చి, తడాఖా, జీనియస్, లక్కీ.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సినిమాలే ఉన్నాయి. ఆ తర్వాత కొన్నాళ్లు గ్యాప్ ఇచ్చి, యూట్యూబ్ లో పలు వెబ్ సిరీస్ లు చేసి యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది.

రీసెంట్ గా విశ్వక్ సేన్ నటించిన 'లైలా' సినిమాలో కూడా సాయి ప్రియా కనిపించింది. అందులో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్ లో మెరిసింది. సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉన్న ఈ బ్యూటీకి.. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో నటించే మంచి ఛాన్స్ దక్కింది. ఆ సీరియల్ ఎపిసోడ్స్ ద్వారా తన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఈ బ్యూటీకి టాలీవుడ్ లో హీరోయిన్ గా లేదా కీ రోల్స్ చేసే అవకాశాలు పెరిగేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టుల్లో సాయి ప్రియా భాగం అయినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.



# మెగా హీరో ప్రేమకథకు ఎసరు పెట్టిన డైరెక్టర్..?

మెగా హీరో సాయిధరమ్ తేజ్ తన బ్రేకప్ పై చేసిన తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సుహాస్ నటించిన 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో పాల్గొన్న తేజు, తన ప్రేమ కథకు దర్శకుడు రామ్ అబ్బరాజు ప్రత్యక్ష సాక్షి అని పేర్కొన్నారు. రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉన్నప్పటి నుంచే వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం ఈ సరదా సంభాషణకు వేదికైంది.

తేజు మాట్లాడుతూ.. నా లవ్ స్టోరీ బ్రేకప్ అవ్వడానికి కారణం వీడే అంటూ రామ్ అబ్బరాజుపై సరదాగా బాంబు పేల్చారు. దీనికి రామ్ స్పందిస్తూ.. ఆవిడ ఒక హీరోయిన్ అని, ఆమె భాష కూడా తమకు రాదని హింట్ ఇచ్చారు. తమ మధ్య ఉన్న చనువుతో ఒకరిపై ఒకరు జోకులు వేసుకోవడంతో అక్కడ నవ్వులు పూశాయి.

ప్రస్తుతం 40లో ఉన్న తేజు ఇంకా పెళ్లి చేసుకోకపోవడంతో, ఆయన ప్రస్తావించిన ఆ హీరోయిన్ ఎవరై ఉంటారా అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు. గతంలో తేజుపై వచ్చిన రూమర్లను ఈ వ్యాఖ్యలు మళ్ళీ గుర్తు చేయడమే కాకుండా, వీరిద్దరి మధ్య నడిచిన ఈ 'ట్రయాంగిల్' కామెడీ హాట్ టాపిక్ గా మారింది.

## 'హనుమాన్ జంక్షన్ 2' పై అర్జున్ కామెంట్స్..



మన తెలుగు సినిమా నుంచి వచ్చిన కొన్ని ఎవర్ గ్రీన్ ఎంటర్టైనర్ చిత్రాల్లో యాక్షన్ కింగ్ అర్జున్ అలాగే నటుడు జగపతి బాబు కాంబినేషన్ లో వచ్చిన మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం హనుమాన్ జంక్షన్ కూడా ఒకటి. అందులో కామెడీ సీన్స్ కానీ ఎమోషన్స్ ఇలా అన్ని రకాలుగా తెలుగు ఆడియెన్స్ ని అలరించి ఎంతగానో ఆకట్టుకుంది. మరి ఇలాంటి కమర్షియల్ ఎంటర్టైనర్ కి సీక్వెల్ అంటే దానిలోని సోల్ ని పోగొట్టకుండా తీయడం ఒకింత కష్టమే.. మరి ఈ సీక్వెల్ పై అర్జున్ సార్జా లేటెస్ట్ గా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. హనుమాన్ జంక్షన్ 2 చేయాలని తనకి కూడా ఉందని. దీనిపై జగపతి బాబుని కలిసినపుడు మాట్లాడిన సమయంలో తాను కూడా అదే అన్నాడు కానీ మంచి కథ సెట్ అవ్వాలని.. ఒకవేళ ఎవరైనా మంచి కథతో వస్తే తానే దర్శకత్వం వహించి నిర్మాణం వహించేందుకు సిద్ధం అని తన కూతురు ఐశ్వర్య అర్జున్ తెరంగేట్రం చేస్తున్న 'సీతా పయనం' సినిమా రిలీజ్ ఇంటర్వ్యూలో తెలిపారు. సో ఈ ఎంటర్టైనింగ్ సీక్వెల్ కి పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి కానీ కథ సెట్ అవ్వాల్సి ఉంది.

# మెగా వారసుల నామకరణం చేసిన రామ్ చరణ్, ఉపాసన దంపతులు

మెగా పవర్స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతులు ఇటీవల కవల పిల్లలకు (బాబు మరియు పాప) జన్మనివ్వడం తో మెగా అభిమానుల్లో సందడి నెలకొంది. ఈ శుభకార్యం తో మెగా కుటుంబంలో వెలుగులు నిండాయి. తాజాగా ఈ చిన్నారుల బారసాల వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ జంట, తమ పిల్లలకు పెట్టిన అర్థవంతమైన పేర్లు అధికారికంగా వెల్లడించారు.

వారసుడికి 'శివ్రామ్' అని నామకరణం చేశారు. ఈ పేరు సాక్షాత్తు ఆ పరమశివుడు మరియు శ్రీరాముడి పేర్ల కలయికగా రూపొందింది. ఇది అపారమైన శక్తిని, భక్తిని మరియు ధర్మాన్ని సూచిస్తుంది. ఇక పాపకు 'అన్వీర దేవి' అనే పేరును ఖరారు చేశారు. ధైర్యం మరియు దైవిక శక్తి కలిగిన పేరుగా ఇది అభిమానుల మనసు గెలుచుకుంటుంది. రామ్ చరణ్ దంపతులకు ఇప్పటికే 'క్లిన్ కారా కొణిదెల' అనే కుమార్తె [illegible] నుండి స్ఫూర్తి పొంది ఆ పేరును నిర్ణయించారు. ఇప్పుడు కవలలకు కూడా ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక విలువలు ఉట్టిపడేలా పేర్లు పెట్టడం పట్ల నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## నేచురల్ స్టార్‌తో వెంకీ అట్లూరి మూవీ.. సెట్ అయ్యేనా..?

దర్శకుడు వెంకీ అట్లూరి 'లక్కీ భాస్కర్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వచ్చిన ఈ చిత్రం కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళ, హిందీ భాషల్లో కూడా ఘనవిజయం సాధించింది. దీనితో వెంకీ అట్లూరి పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ప్రస్తుతం ఆయన కోలీవుడ్ స్టార్ సూర్యతో 'సూర్య 46' అనే క్రేజీ ప్రాజెక్ట్ను పట్టాలెక్కించారు. ఇది వయసులో చాలా వ్యత్యాసం ఉన్న ఒక జంట మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథగా రూపొందుతోంది. సూర్య సినిమా తర్వాత వెంకీ అట్లూరి నేచురల్ స్టార్ నానితో పనిచేసే అవకాశం ఉన్నట్లు ఇండస్ట్రీలో వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' షూటింగ్లో తలమునకలై ఉన్నారు. అయితే, ఈ సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే కొంత ఆలస్యమవుతోంది. ఈ గ్యాప్లోనే వెంకీ అట్లూరి తన తదుపరి కథను నానికి వినిపించినట్లు, దానికి నాని కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

నాని ఇప్పటికే 'సాహో' ఫేమ్ సుజీత్తో ఒక భారీ యాక్షన్ చిత్రాన్ని లైన్లో పెట్టారు. ఒకవేళ వెంకీ అట్లూరి ప్రాజెక్ట్కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, నాని ఏ సినిమాను ముందుగా పూర్తి చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. సుజీత్ మరియు వెంకీ సినిమాలను ఒకేసారి చేస్తారా లేక ఒకదాని తర్వాత ఒకటి చేస్తారా అన్నది వేచి చూడాలి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.